

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 09-03-2023 సంపుటి : 04 సంచిక : 170 పేజీలు : 4 వెల : రూ 3-00

## భారతీయ సంస్కృతిలో మహిళకు పూజనీయ స్థానం

**శ్రీ మాతా రమ్యానంద భారతి స్వామిని**

**- మహతిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

**- డా. కె.రాజేశ్వరిమూర్తికి శ్రీ పద్మావతి విద్యాప్రకాశిని అవార్డు**

**- ముగ్గురికి పద్మావతి అవార్డులు ప్రదానం**

తిరుపతి భారతీయ సంస్కృతిలో మహిళకు పూజనీయ స్థానం ఉందని, ఇక్కడ అణువణువునా స్త్రీ తత్వం ఇమిడి ఉందని రాయలచెరువులోని శ్రీ శక్తి పీఠం పీఠాధీశ్వరి శ్రీ మాతా రమ్యానంద భారతి స్వామిని తెలియజేశారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ మాతా రమ్యానంద భారతి స్వామిని అనుగ్రహ భాషణం చేస్తూ మహిళకు దక్కుతున్న ప్రాధాన్యత దృష్ట్యా భారతదేశంలో ప్రతిరోజు మహిళా దినోత్సవమేనని అన్నారు. మహిళామూర్తి అయిన శ్రీ వకుళామాతకు ఇచ్చిన మాట కోసం శ్రీవారు కలియుగంలో అవతరించి భక్తులను రక్షిస్తున్నారని చెప్పారు. మహిళకు విద్య, వాక్ శక్తి, ఆరోగ్యం, ఆత్మబలం, పరాక్రమం లక్షణాలు ఉండాలని వేదాల ద్వారా తెలుస్తోందన్నారు. మానవశక్తికి దైవశక్తి తోడైతే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంట పాటు ధ్యానం లేదా జపం చేయాలని చెప్పారు. తద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా తయారవుతారని తెలియజేశారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ, మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యంతోనే భారతదేశానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తోందన్నారు. మహిళాశక్తిని జాగృతం చేయడానికే ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని చెప్పారు. స్త్రీ చైతన్య స్వరూపమని, మహిళ ద్వారా కుటుంబం, తద్వారా సమాజం చైతన్యవంతం అవుతాయన్నారు. టీటీడీ లో 1542 మంది మహిళా ఉద్యోగులు చక్కగా పనిచేస్తున్నారని, వీరి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు ఇటీవల మూడు రోజులపాటు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. మహిళకు అవమానం జరిగితే యుద్ధం ప్రారంభమవుతుందని గీతోపదేశంలో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను అందరికీ వినిపించారు. జేఈవో వీరబ్రహ్మం స్వాగతోపన్యాసం చేస్తూ, భగవంతుడు సృష్టిలో మహిళలకు ప్రముఖ స్థానం కల్పించారన్నారు . సృష్టికి మూలం మహిళ అని అన్నారు.

## అక్రమంగా ప్రవేశిస్తే రువాండాకు తరలిస్తాం..! రిషి సునాక్ హెచ్చరిక

లండన్: దేశంలోకి అక్రమంగా ప్రవేశించేవారిపై ఇక కఠినంగా వ్యవహరిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ హెచ్చరించారు.అక్రమ మార్గాల ద్వారా చొరబడే వారిని శరణార్థిగా పరిగణించేందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. బోట్ల ద్వారా అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్నవారికి అడ్డుకట్ట వేసేందుకు బ్రిటన్ కొత్తగా తీసుకువచ్చిన విధానానికి సంబంధించిన వివరాలను రిషి సునాక్ మీడియా ముందు వెల్లడించారు.'అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తే.. ఇక మీరు శరణార్థిగా ఆశ్రయం పొందలేరు. ఆధునిక బానిసత్వం రక్షణ ప్రయోజనాలను కూడా అందుకోలేరు. నకిలీ మానవ హక్కుల దావాలు కూడా వేయలేరు. మొత్తానికి ఇక్కడ ఉండలేరు' అని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ వెల్లడించారు.'అక్రమంగా వచ్చిన వారిని నిర్బంధించి.. కొన్ని వారాల్లోనే వారిని సొంత దేశానికి పంపిస్తాం. లేదా అటువంటి వారిని రువాండా వంటి ఇతర దేశాలకు తరలిస్తాం. ఒకసారి ఇలా వెనక్కి పంపినవారిని అమెరికా, ఆస్ట్రేలియా మాదిరిగా తిరిగి బ్రిటన్‌లోకి అడుగు పెట్టకుండా నిషేధిస్తాం' అని రిషి సునాక్ స్పష్టం చేశారు. చిన్న పడవల ద్వారా ఇంగ్లీష్ ఛానల్‌ను దాటుకొని వచ్చే అక్రమ చొరబాట్లకు తాజాగా తీసుకువచ్చిన బిల్లు అడ్డుకట్ట వేస్తుందని బ్రిటన్ ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.అక్రమ వలసలను అరికట్టడం తన ప్రాధానాంశాల్లో మొదటిదని చెబుతోన్న రిషి సునాక్.. ఇందుకు సంబంధించిన ముసాయిదా చట్టాన్ని ప్రకటించారు. చట్టపరంగా దేశంలోకి ప్రవేశించే వారితోపాటు స్థానికులకు ఇలా అక్రమంగా వలసవచ్చే గ్యాంగులవల్ల ప్రమాదం పొంచివుందన్నారు. ప్రస్తుత పరిస్థితి నైతికమైంది కాదని.. అందుకే ఈ బోట్లను అడ్డుకునేందుకే ఈ కొత్త చట్టమని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ చర్చల మినిట్స్‌ను లిఖితపూర్వకంగా ఇవ్వాలి

**సిఎస్‌ను కలిసి విన్నవించిన జెఎసి నేతలు**

**హామీలకు సంబంధించి స్పష్టత ఇస్తేనే ఉద్యమంపై నిర్ణయం**

**ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు**



అమరావతి,మార్చి8: పెండింగ్ బిల్లులకు సంబంధించిన మొత్తాన్ని మూడు దశలుగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... చర్చల సారాంశాన్ని లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీఎస్ జవహర్ రెడ్డిని కోరామని... సాయంత్రంలోపు చర్చల మినిట్స్ ఇస్తామని సీఎస్ స్పష్టం చేశారన్నారు. సాయంత్రంలోగా మినిట్స్ ఇస్తే.. ఉద్యమ కార్యాచరణపై గురువారం నిర్ణయం తీసుకుంటామన్నారు. సాయంత్రంలోగా మినిట్స్ ఇవ్వకుంటే.. ఉద్యమ కార్యాచరణ యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు. మినిట్స్ ఇస్తే.. ఉద్యమాన్ని గురువారం మధ్యాహ్నం వరకు వాయిదా వేస్తామని... కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకుంటామని అన్నారు. మినిట్స్ ఇచ్చిన తర్వాత కూడా పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉద్యమిస్తామని వెల్లడించారు. ఆయుధం మా చేతుల్లోనే ఉంది. మేం ప్రభుత్వం ట్రాపులో పడడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికలతో మాకు సంబంధం లేదు. మా అజెండా నుంచి పక్కకు వెళ్లం అని తేల్చిచెప్పారు. పీఆర్సీ బకాయిలు, డీఏలపై ఈ నెల 16న చర్చిస్తామని ప్రభుత్వం చెప్పిందని బొప్పరాజు పేర్కొన్నారు.కాగా.. పెండింగ్ ఆర్థిక డిమాండ్లు తీర్చాలంటూ ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రుల కమిటీ సమావేశమైంది. అయితే ఉద్యోగసంఘాలతో జరిగిన మంత్రుల కమిటీ సమావేశం ఏమీ తేలకుండానే ముగిసింది. ఉద్యోగ సమస్యల పరిష్కారంపై ఉద్యోగ నేతలు లిఖితపూర్వక హామీ కోరగా, నెలాఖరుకు రూ. 3 వేల కోట్లు ఇస్తామంటూ మంత్రుల కమిటీ దాటవేసింది. దీంతో ఉద్యమ కార్యాచరణ ఆగేదేలేదని బొప్పరాజు తేల్చి చెప్పారు. ప్రభుత్వం మాత్రం నెలాఖరుకు చేస్తాం... ఏప్రిల్‌లో చేస్తాం... అంటూ మాటల హామీలతోనే సరిపెట్టింది. దీంతో ఇతిమిత్థంగా ఏమీ తేలకుండానే సమావేశం ముగిసిపోయింది.ప్రభుత్వ హామీలన్నీ లిఖిత పూర్వకంగా ఇస్తే ఉద్యమ కొనసాగింపుపై పునరాలోచన చేస్తామని బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి స్పష్టంగా చెప్పినట్లు వెల్లడించారు. మిగిలిన పీఆర్సీ బకాయిలు, కొత్త డీఏలు తదితర అంశాలపై స్పష్టత రావాల్సిన తరుణంలో మళ్లీ సీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెబుతున్నారు. వాటన్నింటినీ లిఖితపూర్వకంగా మినిట్స్ రూపంలో ఇవ్వాలని మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో మంత్రుల కమిటీ, సీఎస్‌కు తెలియజేశాం. తమ అజెండా నుంచి పక్కకు వెళ్లేది లేదని తేల్చి చెప్పారు.

# మహిళల పట్ల జగన్ చిన్నచూపు



చిత్తూరు,మార్చి8 : మహిళలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను విస్మరించారని టిడిపి యువనేత లోకేశ్ మండిపడ్డారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని ప్రకటించి.. అదే మద్యపానంపై డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అన్ని విషయాల్లో మహిళలను టీడీపీ గౌరవించిందని గుర్తుచేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలను చిన్న చూపు చూసిందన్నారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఈ సందర్భంగా లోకేష్ ఆవేదన చెందారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో పాదాయత్ర చేస్తున్న ఆయన బుధవారం ఉదయం మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు పాదాభివందనం చేశారు. అమ్మలేనిది జన్మ లేదు. భూమికన్నా ఎక్కువ భారం మహిళలపై ఉంది. అలాంటి మహిళా దినోత్సవం ఈరోజు జరుపుకోవడం నాకు సంతోషంగా ఉందని అంటూ సమావేశానికి వచ్చిన మహిళలకు లోకేష్ పాదాభివందనం చేశారు. మహిళలకు లోకేష్ ఇచ్చిన గౌరవం పట్ల నారీమణులు హర్షం వ్యక్తం చేశారు. లోకేష్ పాదయాత్ర ఈరోజు 38వ రోజుకు చేరింది. పీలేరు నియోజవర్గంలోని చింతపర్తి విడిది కేంద్రం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర ను ప్రారంభించడానికి ముందు మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన మహిళలకు పాదాభివందనం చేసి.. వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంపూర్ణ మద్యపాన నిషేధం బుట్టదాఖలు**

**చింతపర్తి నుంచి పాదయాత్ర ప్రారంభించిన లోకేశ్**

## నాలుగో టెస్టుకు మోదీ.. ఆస్ట్రేలియా ప్రధానితో కలిసి మ్యాచ్ వీక్షణ

అహ్మదాబాద్: బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా గురువారం నుంచి భారత్-ఆస్ట్రేలియా మధ్య అహ్మదాబాద్‌లో ఆరంభమయ్యే ఆఖరిదైన నాలుగో టెస్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక అతిథిగా హాజరు కానున్నారు.ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్‌తో కలిసి ఆయన మ్యాచ్‌ను వీక్షించబోతున్నారు. ప్రపంచంలోనే పెద్దదైన నరేంద్ర మోదీ స్టేడియం సామర్థ్యం 1,32,000. కానీ ఒక మ్యాచ్‌కు హాజరైన అభిమానుల లెక్కల్లో మెల్‌బోర్న్ స్టేడియం (1,00,024)ది ఇప్పటిదాకా రికార్డుగా ఉంది. నాలుగో టెస్టులో అహ్మదాబాద్ మైదానం కనీసం 95 శాతం నిండినా.. మెల్‌బోర్న్ రికార్డు బద్దలు కావడం ఖాయం. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో తొలి రెండు టెస్టులను భారత్ నెగ్గగా.. మూడో టెస్టులో ఆసీస్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.



## సీఎం జగన్ పై మండిపడ్డ దేవినేని

విజయవాడ ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిపై మాజీ మంత్రి, టీడీపీ నేత ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ ఊరికే దెబ్బతినలేదని,ఇసుక నుంచి తైలం తీయడం వల్లే దానికా గతి పట్టిందని ఆరోపించారు.ప్రాజెక్టును తెలు గుదేశం ప్రభుత్వం 71 శాతం పూర్తి చేస్తే జగన్ ప్రభు త్వం ఈ నాలుగే ళ్లలో ఏడు శాతం పనులు మాత్రమే చేసిందన్నారు.కమీషన్ల కోసం రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్లను మార్చారని ఆరోపించారు. జగన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టును తాక ట్టు పెట్టేశారని విమర్శిం చారు.పోలవరం, రంపచోడ వరం నియో జకవర్గాల్లో ఓడిపోయినా పర్వాలేదన్న ఉద్దేశంతోనే అక్కడి నిర్వాసితులను జగన్ పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.31 మంది ఎంపీలు ఉండి కూడా ఢిల్లీలో డీపీఆర్-2ను ఆమోదిం చుకోలేకపోతున్నారన్న దేవినేని..రాష్ట్రంలో జరుగు తున్న పరిణామాలపై జగన్ మీడియా ముందుకు ఎందుకు రాలేకపోతున్నారని నిలదీశారు.

## మహిళా జర్నలిస్టులు రాణించడం సంతోషంగా ఉంది..

### 'ఏపీలో ప్రతీ పథకంలోనూ మహిళలకే పెద్దపీట'




కృష్ణా: ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. బుధవారం విజయవాడ ఏపీ ప్రెస్ అకాడమీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా.. ఏపీ ప్రభుత్వంపై, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పైనా కొమ్మినేని ప్రశంసలు గుప్పించారు. ఏపీ ప్రభుత్వం మహిళల కోసం ఎంతో చేస్తోంది. మహిళలకు సీఎం జగన్ అన్ని రంగాల్లో పెద్దపీట వేశారు. రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం కల్పించారు. మార్కెట్ యార్డు పదవులను సైతం మహిళలకు కేటాయించడం చరిత్రలో ఇదే తొలిసారి అని కొమ్మినేని తెలిపారు.ఇక ఐఅండ్‌పీఆర్ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజం వృత్తి అంటేనే ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, మహిళలు ఆ సవాళ్లను ఎదుర్కొని రాణించడం సంతోషంగా ఉందని అన్నారు. అలాగే.. ఏపీలో సీఎం జగన్ మోహన్ రెడ్డి మహిళలకు అధికప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. "ప్రతీ పథకంలోనూ మహిళలకే పెద్దపీట వేస్తున్నారు. 30 లక్షల ఇళ్ల పట్టాలు మహిళల పేరిట ఇచ్చారు అని పేర్కొన్నారు. అలాగే.. మహిళా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం అని హామీ ఇచ్చారాయన. ఈ సందర్భంగా.. వీరిరువురు ప్రెస్ అకాడమీ తరపున పలువురు మహిళా జర్నలిస్టులను సత్కరించారు.

## ఎన్టీఆర్ జిల్లాలో మహా పోలీసుల తనిఖీలు

**బాలుర మిస్సింగ్ కేసులో ముఠా గుర్తింపు**

**పదిమంది నిందితులను గుర్తించిన పోలీసులు**

విజయవాడ,మార్చి8:ఎన్టీఆర్ జిల్లాలో మహారాష్ట్ర పోలీసులు తనిఖీలు కలకలం రేపుతున్నాయి. ముంబైలో వరుస బాలురు మిస్సింగ్ ఘటనలపై అక్కడి పోలీసుల ఇక్కడ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముంబైలో బాలురను కిడ్నాప్ చేసి ఎన్టీఆర్ జిల్లాలో మూడు లక్షలకు ముఠా విక్రయాలు జరిపినట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఇందు కోసం ఓ గ్యాంగ్ పని చేస్తున్నట్లు వారు గుర్తించారు. మొత్తం 10 మంది నిందితులను మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. నిందితులు ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్, జగ్గయ్యపేటకు చెందిన వారిగా గుర్తించారు. విజయవాడ రామలింగేశ్వర్ నగర్‌కు చెందిన శ్రావణి, రంజిత.. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో చిన్నారులను విక్రయించినట్లు గుర్తించారు. మహారాష్ట్ర లోని అరబిక్ ట్యూషన్ పాయింట్ వద్ద చిన్నారులు కిడ్నాప్ చేసినట్లు దర్యాప్తులో తేల్చారు.

## ఢిల్లీకి ఎమ్మెల్సీ కవిత.. ఈడీ విచారణకా? లేక..

హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కవితకు ఈడీ బుధవారం నోటీసులు జారీ చేసింది.అయితే, బిజీ షెడ్యూల్ ఉన్నందున రేపటి ఈడీ విచారణను హాజరు కాలేనని ఆమె లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈనెల 15వ తేదీన ఈడీ విచారణకు హాజరు అవుతానని కవిత లేఖలో? పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన జంతర్‌మంతర్ వద్ద ధర్నా, ఇతర కార్యక్రమాలతో బిజీ షెడ్యూల్ ఫిక్స్ అయిన కారణంగా హాజరు కాలేనని తెలిపారు. అందుకే సమయం కావాలని కోరారు.ఇదిలాఉండగా.. కవిత విజ్ఞప్తిపై ఇప్పటివరకు ఈడీ నుంచి ఏ స్పందనా రాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో కవిత బంజారాహిల్స్ నివాసం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి.. అక్కడి నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా కవిత ఈడీ ముందుకు హాజరు కానున్నారా? లేదా జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

# సంపాదకీయం

గురువారం 09-03-2023

## ప్రతి ఐదుగురిలో ఒకరు మత్తు

మొక్కై వంగనది, మానై ఒంగునా.... అని పెద్దలు చెబుతారు. అంటే చిన్ననాటి నుంచి పిల్లలకు చదువు, సంస్కారం, మంచి అలవాట్లు, ప్రవర్తన నేర్పాలి. అప్పుడు మాత్రమే కుటుంబాలకు, దేశానికి మంచి తరాలను అందించగలం. అయితే, ఇటీవల కాలంలో యువతలో చాలా మంది అనేక చెడు వ్యసనాలకు బానిలుగా మారుతూ అటు కుటుంబానికి, ఇటు దేశానికి పనికిరాకుండా పోతూ వివిధ సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు... హత్యలు, మానభంగాలు, ప్రేమ కార్యక్రమాలు, కాదంటే యాసిడ్ దాడులు, మత్తులకు బానిసలు, సామాజిక మాధ్యమాల్లో విహరించడం, అక్రమ సంబంధాలు , సైబర్ నేరాలు ఇలా అనేక విధాలుగా మునిగి తేలుతూ ఉంటున్నారు.ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా మన భారత్ విరాజిల్లుతోంది. వివిధ రంగాల్లో అభివృద్ధి మన యువత మీదనే ఆధారపడి ఉంటుంది అనేది వాస్తవం. నూతన పరిశోధనలకు, ఆవిష్కరణలకు నేటి యువత కృషి చేయవలసి ఉంటుంది. యువత పురోగతి సాధించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ విద్య వైద్యం అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతీ ఒక్కరూ సమాన అవకాశాలు అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. ఇటువంటి మహా సంకల్పం సాధించడానికి ప్రభుత్వాలు తమ ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంతో పాటు, కుటుంబ సభ్యులు ముఖ్యంగా తల్లిదండ్రుల పాత్ర కీలకం అని గ్రహించాలి. .యువత మద్యం, డ్రగ్స్ మత్తులో ఊగిపోతూ, మునిగిపోతున్నారు. మన దేశంలోకి డ్రగ్స్ ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల నుంచి ఎక్కువ మోతాదులో వచ్చి చేరుతున్నాయి. పాక్, మయన్మార్ సరిహద్దు ప్రాంతాలు నుంచి ఈ డ్రగ్స్ కుప్పలు తెప్పలుగా దేశం నలుమూలలకూ వచ్చి చేరుతూ యువతను అన్ని విధాలా నాశనం చేస్తున్నాయి. మయన్మార్ లోని పర్వత ప్రాంతాల్లో పండిస్తున్న గంజాయి ముఖ్యంగా నల్లమందు ( ఓపియం) అసోం, నాగాలాండ్, మణిపూర్, మిజోరం మీదుగా దేశంలో ప్రవేశిస్తూ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. 2018 లో జరిపిన ఒక సర్వేలో దేశంలో 23.2 కోట్ల మంది డ్రగ్స్‌కు బానిస అయ్యారు అని తెలిపింది. వీరిలో 10-17 సంవత్సరాల వయస్సు గల వారు సుమారు 1.5 కోట్ల మంది ఉన్నారు అని తెలిపింది. ఐక్యరాజ్యసమితి యు.ఎన్.ఓ.డి.సి కూడా భారత్ యువత లోని మత్తులకు బానిసలు అవటం పట్ల తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. 2022 ఫిబ్రవరిలో నాటికి ఒక్క అసోం రాష్ట్రంలోనే 2,878 కేసులు నమోదు చేసి, 4,691 మందిని అరెస్టు చేశారు అంటే ఎంత దారుణంగా ఈ దందా కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇక 2023, ఫిబ్రవరి 20వ తేదీ నాటికి, 1273.65 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా మత్తు దందాలకు గోల్డెన్ ట్రయాంగల్‌గా పేరు పొందిన ఈ సరిహద్దు ప్రాంతాలు దేశ యువతకు డెత్ ట్రయాంగల్ గా మారుతున్నాయి.ఇక మనదేశంలో హైస్కూల్ స్థాయి నుంచి కళాశాల విద్యార్థుల వరకూ, పల్లెటూరు నుంచి పట్టణం వరకు ఈ డ్రగ్స్ మహమ్మారి కరోనా వైరస్ కంటే వేగంగా, విస్తృతంగా వ్యాప్తి చెందుతూ దేశ యువతను కబళిస్తున్న వేళ.... అందరూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. డ్రగ్ పెడ్లర్స్‌పై ఉక్కు పాదం మోపాలి. సరిహద్దుల్లో నిఘా పెంచాలి. అనుమానిత విదేశీయులను డేగకన్నుతో పరిశీలించాలి. పబ్స్, బార్, వివిధ పార్టీల ప్రదేశాలపై నిఘా పెంచాలి. ఇటీవల కాలంలో సెల్, రకరకాల వెబ్ సైట్లు, యాప్‌లు అందుబాటులోకి రావడంతో అన్ని ప్రదేశాలకు, అందరికీ ఈ డ్రగ్స్ రకరకాల మార్గాల ద్వారా సులభంగా చేరిపోతున్నాయి. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి. పారదర్శకంగా పని చేయాలి. అప్పుడు మాత్రమే ఈ మత్తు పీడను నివారించగలం.భవిష్యత్తులో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి పునాది రాళ్ళు యువతే... అటువంటి యువత విద్య ద్వారా అనేక విషయాలు గ్రహించి, దేశవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని కీలకపాత్ర పోషించాలి. ఆ విధంగా ప్రభుత్వాలు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఉత్పత్తి సాధనకు, నైపుణ్యాలు అభివృద్ధి పరుచుకోవాలి. భవిష్యత్తులో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపుదిద్దుకోవాలంటే నేటి యువత శారీరక మానసిక సామర్థ్యం మీదనే ఆధారపడి ఉంది అని మరువరాదు. దేశం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఇలా అనేక రంగాల్లో అభివృద్ధి సాధించడానికి నీతి నిజాయితీలతో కూడిన యువత కావాలి. శారీరక మానసిక ఆరోగ్యం కలిగిన యువత పైనే మన భారత్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అని అందరూ గ్రహించాలి....

## కోటంరెడ్డి, ఆనంల దారెటు...?

నెల్లూరు, మార్చి 8, ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. నెల్లూరు రెబల్ ఎమ్మెల్యేలుగా ఉన్న వీరిద్దరూ వైసీపీకి దూరం జరిగారు. వారి స్థానాల్ల నియోజకవర్గ ఇన్ చార్జ్ లను ప్రకటించిన అధిష్టానం పూర్తిగా వారిని పక్కనపెట్టింది. కనీసం అధికారులు కూడా వారి మాట వినకుండా చేసింది. పేరుకే ఎమ్మెల్యేలు కానీ, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకంటే వారి పరిస్థితి దారుణంగా ఉంది. మరి రోజులు గడుస్తున్నా వారిద్దరూ ఇంకా సైలెంట్ గానే ఉన్నారెందుకు..? కోటంరెడ్డి రూటు ఎటు..? ఆనం దారెటు..?వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి ఆ మధ్య కొన్ని మండలాల నేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారు ఆనం రామనారాయణ రెడ్డి. ఆ తర్వాత ఆయన పూర్తిగా సైలెంట్ అయ్యారు. 2024లో ఆయన ఏ పార్టీలోకి వెళ్తారనేదానితోపాటు, ఏ నియోజకవర్గంలో పోటీ చేస్తారనేది కూడా పెద్ద సస్పెన్స్ గా మారింది. దాదాపుగా ఆయన వెంకటగిరినుంచి తిరిగి పోటీ చేసే అవాకశం లేదు. కోటంరెడ్డి ఎపిసోడ్ జరగకపోయి ఉంటే నెల్లూరు రూరల్ ని ఆనం ఫిక్స్ చేసుకునేవారు, అదే నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసేవారు. కానీ పరిస్థితులు సానుకూలంగా లేవు. నెల్లూరు రూరల్ ఎమ్మల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా టీడీపీలో చేరే అవకాశాలున్నాయి. సో.. ఆనం టీడీపీలో చేరినా ఆ నియోజకవర్గం ఆయనకు దక్కదు. ఇక ఆనంకి ఉన్న మరో ఆప్షన్ ఆత్మకూరు. గతంలో ఆయన ఆత్మకూరునుంచి పోటీ చేసి గెలిచి, మంత్రి పదవి కైవసం చేసుకున్నారు. ఆ సెంటిమెంట్ బాగానే ఉందనుకున్నా.. గతంలో ఆయన కుమార్తెను టీడీపీనుంచి ఆత్మకూరు ఎమ్మెల్యేగా పోటీ చేయిస్తారనే ప్రచారం జరిగింది. దాన్ని ఆయన ఎప్పుడూ ఖండించలేదు. అంటే ఆనంకి ఆత్మకూరుతోపాటు మరో నియోజకవర్గం కూడా కావాలి. అందుకే ఆయన ప్రస్తుతం సైలెంట్ గా ఉన్నారు.ఆనం నిష్క్రమణలో పెద్దగా సంచలనాలేవీ లేవు. ఆయన ప్రభుత్వంపై ఓ మోస్తరు విమర్శలు చేశారు, జగన్ సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. అయితే ఎమ్మల్యే కోటంరెడ్డి మాత్రం ప్రభుత్వం తన ఫోన్లు ట్యాప్ చేస్తోందంటూ ఘాటు విమర్శలు చేశారు. అక్కడ కూడా జగన్ ఘాటుగానే రియాక్ట్ అయ్యారు. వెంటనే ఆయన స్థానంలో నియోజకవర్గ ఇన్ చార్జ్ గా ఎంపీ ఆదాలను నియమించారు. ఆ తర్వాత కోటంరెడ్డిని ప్రభుత్వం పూర్తిగా టార్గెట్ చేసిందనే ఆరోపణలు వినపడుతున్నాయి. గతంలో టీడీపీ నేతలపై జరిగిన దాడి కేసులో కోటంరెడ్డి బ్రదర్స్ పేర్లు కూడా ఉన్నాయి. ఇప్పటికే కోటంరెడ్డి అనుచరులను అరెస్ట్ చేశారు, కోటంరెడ్డి విషయంలో కూడా ఇలాంటి నిర్ణయం తీసుకుంటారేమోననే అనుమానాలున్నాయి.

కోటంరెడ్డి అయినా, ఆనం అయినా.. ఇద్దరూ టీడీపీలోకి వెళ్తారనే ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. మరి టీడీపీనుంచి వీరికి ఆహ్వానం ఉందా, కనీసం టికెట్ ఇస్తారనే హామీ ఉందా అనేది అటువైపు నుంచి అంత బలంగా వినపడటంలేదు. కోటంరెడ్డి విషయానికొస్తే.. ఆయన్ను పార్టీలోకి తీసుకోవద్దు అంటూ నెల్లూరు రూరల్ టీడీపీ నేతలు ఇప్పటికే పలుమార్లు కుండబద్దలు కొట్టారు. టీడీపీ నేతలపై కోటంరెడ్డి గతంలో దాడులు చేయించారని, అలాంటి నాయకుడు తమకు అక్కర్లేదని అంటున్నారు. ఆనం విషయానికొస్తే అలాంటి అడ్డంకులు అస్సలు లేవు. ఆనం ఏ నియోజకవర్గానికి వచ్చినా ఆయనకు టీడీపీలో స్వాగతం పలికేందుకు స్థానిక నేతలు సిద్ధంగానే ఉన్నారు. నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్ల ప్రస్తుతం వైసీపీ హవా నడుస్తోంది. ఆనం, కోటంరెడ్డి ఇద్దరూ టీడీపీలోకి వస్తే.. కనీసం ఆ రెండు స్థానాల్లో అయినా విజయావకాశాలుంటాయని అంటున్నారు.

## కమలంలో క్రమ-శిక్షణా చర్యలు



విజయవాడ, మార్చి 8, ఏపీ బీజేపీలో అసమ్మతి స్వరం వినిపిస్తున్న వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమయినట్లుగా కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో ఏపీ బీజేపీ నాయకత్వంపై తిరుగుబాటు ఎక్కువైంది. సోము వీర్రాడుపై డిల్లీకి వెళ్లి మరీ ఫిర్యాదు చేశారు. తర్వాత బీజేపీ ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధరన్ ఏపీ పర్యటనకు వచ్చారు. ఇప్పుడు ఇలాంటి సమస్యలన్నీ అధిగమించి.. దూకుడుగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పార్టీకి చెందిన నాయకులు పలువురు పార్టీ నాయకత్వాన్ని ధిక్కరించి మాట్లాడటంతో వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర పార్టీకి సిఫారసు చేసే అవకాశం కనిపిస్తోంది. భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణకు ప్రాదాన్యత ఉంటుంది పార్టీ లైన్ దాటి ఇష్టాను సారంగా వ్యవహరిస్తే వేటు వేస్తారు. ఇటీవల కన్నా లక్ష్మినారాయణ ఎపిసోడ్ లో మాత్రం ఈ వ్యవహారం కాస్త నెమ్మదించిందనే ప్రచారం ఉంది. కన్నా లక్ష్మినారాయణ వంటి సీనియర్ నేత పార్టీ రాష్ట్ర నాయకత్వం పై ప్రెస్ మీట్ పెట్టి మరి విమర్శలు చేశారు. కోర్ కమిటిలో సమాచారం ఇవ్వకుండా అద్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజు ఇష్టాను సారసంగా పార్టి వ్యవహారాలను నడిపిస్తున్నారని ,తాను నియమించిన వారిని సోము వీర్రాజు ఎకపక్షంగా తొలగించారిని, అది కూడ ముదస్తు సమాచారం ఇవ్వకుండా చర్యలు తీసుకోవటం పై కన్నా లక్ష్మినారాయణ మండిపడ్డారు. అదే సమయంలో తొలగించిన నేతలు కూడ పార్టీ నుండి వైదొలుగుతూ,రాజీనామా చేశారు. ఈ ఎపిసోడ్ పార్టిలో తీవ్ర కలకం రేపింది.అదే సమయంలో కన్నా లక్ష్మినారాయణ కూడ పార్టీ నేతలతో, తన వర్గంతో సమావేశం ఏర్పాటు చేసుకోవటం,బీజేపికి రాజీనామా చేసి తెలుగు దేశం పార్టి తీర్థం పుచ్చుకోటం కూడ జరిగిపోయింది. నా ఈ వ్యవహారం పై ఇప్పటి వరకు భారతీయ జనతా పార్టీలోని నేతలు ఎవ్వరూ స్పందించలేదు.కన్నా పై కనీసం క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకోలేదు. నోటీసులు కూడా ఇవ్వలేదు.అయితే కన్నా పార్టీ నుండి బయటకు వెళటానికి ఫిక్స్ అయిపోయారు కాబట్టి అలాంటి వ్యాఖ్యలు చేశారు.. అలాంటప్పుడు పార్టి నుండి సస్పెండ్ చేశామనే ముద్ర మాత్రం భారతీయ జనతా పార్టీకి ఎందుకు ఉండాలనే వాదన కి కొందరు నేతలు వ్యక్తం చేసినట్లుగా చెబుతున్నారు.ఢిల్లీ బాట పట్టిన అసంతృప్తి నేతలు...కన్నా రాజీనామా చేసిన తర్వాత ఏపీ బీజేపీ సీనియర్లు కొందరు అగ్ర నాయకులను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే వారికి అపాయింట్ మెంట్ లభించలేదని చెబుతున్నారు. విభేదాలు ఉన్నా,సమస్యలు ఉన్నా రాష్ట్ర నాయకత్వం వద్ద కాని లేదా, క్రమశిక్షణా సంఘం వద్ద కాని తేల్చుకోవాలని సూచించినట్లుగా చెబుతున్నారు.ఈ వ్యవహారం పై ఆంధ్రప్రదేశ్ బీజేపి రాష్ట్ర కమిటి కూడ సీరియర్ అయ్యింది. కనీసం తమ కు సమస్యలను గురించి వివరించకుండా, అగ్రనాయకత్వం వద్దకు పంచాయితీకి వెళ్లటం పై అసంతృప్తి గా ఉన్నారని అంటున్నారు.అందులో భాగంగానే క్రమిశిక్షణా కమిటి నుండి ఈ వ్యవహారాన్ని చర్చించి త్వరలోనే చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారని పార్టి నేతలు అంటున్నారు. ఇష్టాను సారంగా మాట్లాడటం,అభ్యంతరకరమయిన పరిస్దితులు తీసుకురావటం వంటి ఘటనలు ఉత్పన్నం అవుతున్నందున సీరియస్‌గాఉండాలని రాష్ట్ర నాయకత్వం అనుకుంటోంది.

## ఉద్యోగులకే జీతాలు లేటు...

### ఎమ్మెల్యేలకు మాత్రం... ఫస్ట్ తారీఖు...

విజయవాడ, మార్చి 8 ఏపీలో ఉద్యోగులకు జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది కాని ప్రజా ప్రతినిధులకు మాత్రం ఠంచనుగా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నారు. ఏపీలో ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలంటూ కొంతకాలంగా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎప్పుడు జీతాలు చెల్లిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకురాలు ఆర్టీఐ దరఖాస్తుకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్లు సమాధానం లభించింది.వైసీపీ మంత్రుల జీతాల చెల్లింపుపై ఆర్టీఐ యాక్ట్ ద్వారా సమాచారం కోరుతూ ఏపీ కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ దరఖాస్తు చేశారు. పద్మశ్రీ లేఖకు ఆర్టీఐ అధికారులు సమాచారం ఇచ్చారు. నెలలో మొదటి రోజే ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోందని, ఉద్యోగులు ఏం పాపం చేశారని వారికి ఎందుకు జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వానికి, ప్రజలకు సేవలు చేస్తున్న ఉద్యోగులకు సకాలంలో ఎందుకు జీతాలు చెల్లించడం లేదని ప్రశ్నించారు. జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు రొడెక్కుతుంటే ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా అని నిలదీశారు. ఏం సాధించారని మంత్రులు, ఎమ్మెల్యేలు జీతాలు పొందుతున్నారని ప్రశ్నించారు. ఉద్యోగులకు పిఎఫ్ ను కూడా ప్రభుత్వం సక్రమంగా చెల్లించడం లేదని, ఉద్యోగులు పదవి విరమణ చేసిన తరువాత వారికి వచ్చే ప్రయోజనాలను కూడా సరిగా అందించడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల సంక్షేమం తమ ప్రాధాన్యత అంటున్నా జీతాలే చెల్లించడం లేదని ఆరోపించారు. భవిష్యత్ లో ఉద్యోగులు చేసే పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ,ఉపాధ్యయ,కార్మిక,రిటైర్డు కాంట్రాక్టు ఉ ఔట్ సోర్సింగు ఉద్యోగుల దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కార కొరకు ఎపిజెఏసి అమరావతి రాష్ట్రకార్యవర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 9 నుండి ఏప్రిల్ 3 వరకు ఉద్యమ కార్యచరణ ప్రకటించామని ఏపిజెఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటె?శ్వర్లు తెలిపారు.ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయింపులు చేస్తే ఎందుకు మా జీతాలు/పెన్షలు గత రెండు సంవత్సరాలుగాఒకటవ తేదీన ప్రభుత్వం చెల్లించలేక పోతుందని ప్రశ్నించారు. నిజంగా ఉద్యోగులకు నిధులు కేటాయించి ఉంటే రావల్సిన డిఏ బకాయిలు, ఖఖీఅ బకాయిలు, రావల్సిన కొత్త డిఏ లు, సరెండర్ లీవులు, ఎర్నేడ్ లీవులు, తదితర చట్టబద్దంగా రావాల్సిన కోట్లాది రూపాయల బిల్లులు ఎందుకు సకాలంలో ఇవ్వడము లేదో ప్రభుత్వం తెలపాలన్నారు.దాచుకున్న షుమారు 3000కోట్ల ఉఖఈ డబ్బులు కూడా ఉద్యోగుల కుటుంబ అవసరాలకు ఎందుకు చెల్లించడం లేదని నిలదీశారు. వేల కోట్ల రూపాయల డిఏ బకాయిలు ఎందుకు సకాలంలో చెల్లించలేక పోతున్నారని అఖూ ఉద్యోగుల నుండి రికవరీ చేసిన డబ్బులు, ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం కలిపి ప్రభుత్వం వాడుకున్న రూ2,600 కోట్లు ఎప్పుడు ఆ ఉద్యోగుల ఖాతాలలో ఎప్పుడూ జమచేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## స్మార్ట్ కొంటే బీర్ ఫ్రీ....

లక్నో, మార్చి 8, (న్యూస్ పల్స్)నియోగదారులను ఆకర్షించేందుకు కొందరు వ్యాపారులు వినూత్నమైన ఆఫర్లను ఇస్తుంటారు. ప్రచారం కొత్త పంథాను అనుసరిస్తుంటారు. ఇదే రీతిలో కస్టమర్ల కోసం ఓ వ్యాపారి వినూత్నమైన ఆఫర్ ప్రకటించాడు. తమ షాప్‌లో స్మార్ట్‌ఫోన్ కొంటే బీర్ ఉచితం అంటూ వెల్లడించాడు. దీంతో జనం ఎగబడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని భదోహిలో ఇది జరిగింది. ఫోన్ కొనుగోలుకు బీర్ ఫ్రీ అని ప్రకటించగానే ఆ షాప్‌కు జనాలు భారీగా వచ్చారు. దీంతో పోలీసులు ఆ షాపు యజమానిని అరెస్టు చేశారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారంటూ ఆ వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేస్తే రెండు బీర్ క్యాన్స్ ఉచితంగా ఇస్తామంటూ చౌరీ రోడ్‌లో మొబైల్ షాప్ నడుపుతున్న రాజేశ్ మౌర్య ప్రకటన ఇచ్చారని కోత్వాలీ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు వెల్లడించారు. “మార్చి 3వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ మధ్య ఆండ్రాయిడ్ ఫోన్ కొన్న వారికి రెండు బీర్ క్యాన్లు ఫ్రీగా ఇస్తామని పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా రాజేశ్ మౌర్య ప్రచారం చేశారు” అని పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ అజయ్ కుమార్ వెల్లడించారు. ఈ ఆఫర్ గురించిన సమాచారం ఎక్కువ మంది ప్రజలకు చేరింది. దీంతో ఒక్కసారిగా షాప్‌కు వచ్చారు జనాలు. భారీగా గుమికూడారు. అయితే ఈ ఆఫర్ ప్రకటించిన వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ ఆదేశించటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆ వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు మొబైల్ షాపు వద్ద ప్రజలు భారీగా గుమికూడిన సమయంలో వ్యాపారి మౌర్యను పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించినందుకు ఐపీసీ సెక్షన్ 151 కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే షాప్‌ను సీజ్ చేసినట్టు వెల్లడించారు.

## కర్నూలులో పులి పిల్లల కలకలం

కర్నూలు, మార్చి 8, వన్య మృగాలు జనావాసాల్లోకి వస్తున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఇటీవల ఏపీలోని పలు జిల్లాల్లో పెద్ద పులి సంచారం ప్రజల్ని హడలెత్తించింది. తాజాగా నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ కొత్తపల్లి మండలంలో పెద్ద పులి పిల్లల కలకలం రేపుతున్నాయి. పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నాలుగు పెద్ద పులి పిల్లలను గ్రామస్తులు గుర్తించారు. కుక్కలు దాడిలో గాయ పరచకుండా పులి పిల్లలను గదిలో భద్రపరిచి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు గ్రామస్థులు. నంద్యాల జిల్లా ఆత్మకూరు, నందికొట్కూరు, వెలుగోడు ప్రాంతాల్లో తరచూ పెద్ద పులులు సంచరిస్తున్నాయి. ఇటీవల ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాజాగా నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో పెద్దపులి పిల్లలు కలకలం రేపుతున్నాయి. కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురంలో ఆదివారం ఓ యువకుడికి పెద్దపులి పిల్లలు కనిపించాయి. గ్రామంలోని ఓ ఇంటి వద్ద గొడకు ఆనుకుని పులి పిల్లలు నిద్రపోతుండగా యువకుడు వాటిని గమనించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. ఒకేసారి నాలుగు పులి పిల్లలు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పులి పిల్లలు ఉన్నాయంటే సమీపంలోనే పెద్ద పులి ఉండి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. పిల్లలు కోసం పెద్ద పులి మళ్లీ ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. కుక్కల దాడి నుంచి రక్షించేందుకు పులి పిల్లలను స్థానికంగా ఓ గదిలో ఉండి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గొల్లఘాట్, గుంజాల శివారులో సంచరిస్తున్న నాలుగు పులులు పెన్ గంగా నది దాటి మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యంలోకి వెళ్లిపోయాయి. ఇటీవల స్థానికంగా నాలుగు పులులు కనిపించడంతో భీంపూర్ మండలంలోని సరిహద్దు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలు సేకరించి బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అయితే ప్రస్తుతం ఆ నాలుగు పులులు గుంజాల వడూర్ శివారు మీదుగా పేన్ గంగానది దాటి మహారాష్ట్రలోని హివ్ రీ గ్రామం నుంచి తిరిగి తిప్పేశ్వర్ అభయారణ్యంలోకి వెళ్లిపోయాయని అటవీ అధికారులు తెలిపారు. హివిరి గ్రామ సరిహద్దులో పులులు తిరిగి వెళ్లిన ప్రదేశంలో పులి పాదముద్రలు గుర్తించారు. తిప్పేశ్వర్ అభయారణ్యం అటవీశాఖ అధికారులు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించడంతో భీంపూర్ మండల సరిహద్దు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## కన్నా వర్సెస్ అంబటి



గుంటూరు, మార్చి 8, కన్నా లక్ష్మీనారాయణ. టిడిపిలో కొత్తగా చేరిన మాజీ మంత్రి. ప్రస్తుతానికి టీడీపీకి జిల్లాలో ట్రబుల్ షూటర్‌గా వినిపిస్తున్న పేరు. గ్రూపుల పేరుతో పార్టీలో ఎవరన్నా సమస్యలు సృష్టిస్తే కన్నా పేరు చెప్పి షాక్ ఇస్తున్నారట. ముఖ్యంగా గుంటూరు పశ్చిమ, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి టిడిపి నుంచి ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో టికెట్స్ కోసం టీడీపీలోని కమ్మసామాజికవర్గ నేతలు పోటీ పడుతున్నారు. దీంతో ఈ మూడు చోట్లా నాయకులు తమకు సీటు కావాలని అడిగితే.. ఆ సీటు మీకు కాదు.. కన్నా పోటీ చేయొచ్చు అని చెబుతున్నారట. వాస్తవానికి ఎక్కడ పోటీ చేయాలో కన్నాకే క్లారిటీ లేదట. ఎవరు ప్రశ్నించినా పార్టీ ఎక్కడ నిర్ణయిస్తే అక్కడ పోటీ చేస్తా అని కన్నా బదులిస్తున్నారు. ఈ సందర్భంగా కన్నా పేరు సత్తెనపల్లిలో కాస్త గట్టిగానే వినిపిస్తోందట. ఇందుకు టీడీపీ లెక్కలు టీడీపీ దగ్గర ఉన్నాయట. సత్తెనపల్లిలో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు మంత్రి అంబటి రాంబాబు. ఇక్కడ మంత్రిని ఓడించాలంటే.. కన్నానే సరైన క్యాండిడేట్‌గా టీడీపీ పెద్దలు భావిస్తున్నారట.గుంటూరు పశ్చిమ.. పెదకూరపాడు నియోజకవర్గాలతో పోల్చితే సత్తెనపల్లిలో కాపు సామాజికవర్గం ఓట్లు కొంచెం ఎక్కువ. అంబటికి కాపు ఓట్లు మళ్లకుండా కన్నాను పోటీ చేయిస్తే ప్లాన్ వర్కవుట్ అవుతుందనే ఆలోచనలో టీడీపీ అధిష్ఠానం ఉందట. ఇటీవల కాలంలో కన్నా సైతం సత్తెనపల్లిలో ఎక్కువగా పర్యటించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. అలా అని కన్నా మిగతా నియోజకవర్గాల్లో తిరగడం లేదా అంటే.. వెళ్తున్నారు. కానీ సత్తెనపల్లిలో కొంచెం ఎక్కువగా తిరుగుతున్నారు. సత్తెనపల్లి టీడీపీలో నాయకులు మూడు గ్రూపులుగా విడిపోయి కొట్టుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ముగ్గురికీ కాకుండా కన్నాకు సీటు ఇస్తే.. వాళ్లంతా పార్టీ విజయం కోసం కచ్చితంగా కలిసి పనిచేస్తారని.. అలా కాదని ఆ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మిగతా వారు గోతులు తవ్వేస్తారనే అభిప్రాయంలో హైకమాండ్ ఉందట. సత్తెనపల్లిలో కన్నాను పోటీ చేయిస్తే.. మంత్రి అంబటికి చెక్ పెట్టినట్టు అవుతుంది.. ఇటు టీడీపీలో వర్గపోరుకు ఫుల్ స్టాప్ పడుతుందనే లెక్కలు వేస్తున్నారట పసుపు పార్టీ పెద్దలు.మొత్తానికి టీడీపీలో కన్నా చేరిక ఓ సంచలనం అయితే.. ఆయన వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారు అనేది మరో ఆసక్తికర అంశం. పనిలో పనిగా మంత్రి అంబటిని లక్ష్యంగా చేసుకుంటారనే ప్రచారం ఇంకా ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే వచ్చే ఎన్నికలలో అంబటి, కన్నా మధ్య ఫైట్ బిగ్‌ఫైటేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఎంపీగారు... 4 ఏళ్లుగా నల్లపూసే

ఏలూరు, మార్చి 8,ఎంపీగా గెలిచి నాలుగేళ్లు అయినా ఇప్పటికీ నల్లపూసే. నియోజకవర్గ పరిధిలోని కీలక సమస్యలకు స్పందించరనే అభిప్రాయం ఉంది. సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సఖ్యత లేదన్నది మరో విమర్శ వినిపిస్తోంది...కోటగిరి శ్రీధర్. ఏలూరు ఎంపీ. ఒకప్పుడు రాజకీయాల్లో చక్రం తిప్పిన కోటగిరి విద్యాధరరావు కుమారుడే శ్రీధర్. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి ఏలూరు లోక్‌సభ సభ్యుడిగా గెలిచినా.. జనాలతో అటాచ్‌మెంట్ తక్కువ. సొంత పార్టీ ఎమ్మెల్యేలతోనూ అంతంత మాత్రంగానే ఉంటారని చెబుతారు. అందుబాటులో ఉండరనేది మరో పెద్ద విమర్శ. ఎంపీగా గెలిచిన తర్వాత ఏలూరు పార్లమెంట్ పరిధిలో శ్రీధర్ పర్యటించిన సందర్భాలను.. పరిష్కరించిన సమస్యలను వేళ్లమీద లెక్కపెట్టొచ్చని వైసీపీ వర్గాలే కామెంట్స్ చేస్తుంటాయి. ఒకవేళ పర్యటనలకు వెళ్తే అక్కడ గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తారనేది స్థానిక ఎమ్మెల్యేల అభ్యంతరం.

# మంత్రులకు ఎదురు గాలి....

విశాఖపట్టణం, మార్చి 8, యలసీమ, కోస్తా, పల్నాడు ప్రాంతాలు ఏవైనా అధికార వైసీపీ ప్రజాగ్రహాన్ని ఎదుర్కుంటోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎక్కడికక్కడ ఎదురీదక తప్పని పరిస్థితే వుంది. ఎమ్మెల్యేలు, మంత్రులు అనే తేడా లేకుండా అందరి గుండెల్లోనూ ఓటమి భయం దౌడు తీస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వై నాట్ 175' అని బింకాలు పోతున్నా, వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉందని, సర్కార్ వారి ఐప్యాక్ సహా ఒకటికి మూడు సర్వేలు నొక్కి వక్కాణిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రుల జాతకాలపై ఐ ప్యాక్ నిర్వహించిన సర్వేలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంజాద్ బాషా, నారాయణస్వామి, పినిపె విశ్వరూప్, దాడిశెట్టి రాజా మినహా మిగిలిన మంత్రులు, మాజీ మంత్రులు ఎవరూ తిరిగి అసెంబ్లీ గడప తొక్కే అవకాశమే లేదని సర్వే తేల్చి చెప్పిందని అంటున్నారు. నిజానికి, ఈ నలుగురైదుగురు మంత్రులు కూడా ఖాయంగా గెలుస్తారని కాదుట, మిగిలిన వారికంటే గెలిచే అవకాశాలు వీరికి కొంచెం ఎక్కువగా ఉన్నాయని మాత్రమే ఐప్యాక్ సర్వే స్పష్టం చేసినట్లు సామాజిక మాధ్యమంలో ప్రచారం జరుగుతోంది. ఉత్తారాంధ్రలో అయితే, ఆరుగురికి ఆరుగురు మంత్రులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఐ ప్యాక్ సర్వే స్పష్టం చేసిందని, అందుకే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే విశాఖకు మకాం మార్చే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే, ఉత్తరాంధ్ర ప్రజలు మాత్రం ఇప్పటికే ఫిక్సయి పోయారని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అందుకే, ఉత్తరాంధ్ర మంత్రులలో ఒకరు కూడా గెలిచే అవకాశమే లేదని తెలియడంతో అధికార పార్టీలో కలవరం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25 మంది మంత్రులు, తాజా మాజీ మంత్రులపై ఐ ప్యాక్ టీమ్ సర్వే చేసినట్టు తెలుస్తోంది. ఈ సర్వే ప్రకారం ప్రస్తుత మంత్రుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంజాద్ బాషా, నారాయణస్వామి, పినిపె విశ్వరూప్, దాడిశెట్టి రాజా పేర్లు గెలిచే అవకాశమున్న వారి జాబితాలో కనిపిస్తున్నాయన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావులు ఓటమి అంచున ఉండడం విశేషం. మంత్రి బొత్స సత్యనారాయణ, ఉమ్మడి రాష్ట్రంలోనూ మంచి పట్టున్న నాయకుడు. ముఖ్యంగా సొంత జిల్లా విజయనగరం జిల్లాను తన కుటంబ సామ్రాజ్యంగా మలుచుకున్నారు. చీపురుపల్లి నియోజక వర్గంలో ఆయనకు ఎదురన్నదే లేదని అంటారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన అన్నినియోజక వర్గాల్లోనూ డిపాజిట్ కోల్పోయింది. అయితే అందుకు ఒకే ఒక్క మినహాయింపు చీపురుపల్లి నియోజక వర్గం. బొత్స ఒక్కరే డిపాజిట్ దక్కించు కున్నారు. అయితే, ఆయన మళ్ళీ అదే నియోజక్వరం నుంచి పోటీ చేస్తే, ఓడిపోతారని సర్వేలో తేలినట్టు తెలుస్తోంది. 2004 నుంచి చీపురుపల్లి నుంచి పోటీచేసిన బొత్సకు 2014లో మాత్రం ఓటమి ఎదురైంది. అయితే ఈసారి చీపురుపల్లి నుంచి బొత్స గెలుపు అంత ఈజీ కాదట. అందుకే ఆయన వేరే నియోజకవర్గాన్ని వెతుక్కునే పనిలో ఉన్నట్టు సమాచారం. మంత్రి ధర్మాన ప్రసాదరావు సైతం శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎదురీదుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఆయన టీడీపీ అభ్యర్థిపై ఏడు వేల ఓట్లతో మాత్రమే గెలుపొందారు. మూడేళు ఎమ్మెల్యేగా కొనసాగిన ఆయన ఇటీవలే మంత్రి అయ్యారు. కానీ ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. కాంగ్రెస్ లో ఉన్నప్పుడు ప్రదర్శించిన దూకుడు ఇప్పుడు లేదు. దీంతో అటు సొంత పార్టీ నాయకులతో పాటు నియోజకవర్గ ప్రజల్లో కూడా అసంతృప్తి నెలకొని ఉంది. రోజు రోజుకూ ఆయనపై వ్యతిరేకత పెరుగుతూ వస్తోంది. దీంతో ఆయనకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని ఐ ప్యాక్ తన సర్వేలో గుర్తించినట్టు సమాచారం. మంత్రి సీదిరి అప్పరాజు పరిస్థితి కూడా బాగాలేదు. పలాస నియోజకవర్గంలో ఆయన సొంత పార్టీ నుంచే అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలు పెరుగుతుండడం, అనుచరులు దందాలకు దిగుతుండడం ఆయనకు మైనస్ గా మారింది. అటు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులు లేకపోవడం, నిత్యం రాజకీయ వివాదాలు జరుగుతుండడంతో ప్రజల్లో ఒకరకమైన అసంతృప్తి పెల్లుబికినట్టు సమాచారం. మంత్రి చేసింది తక్కువ..ఆర్భాటం ఎక్కువ కావడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరగడానికి కారణంగా ఐ ప్యాక్ టీమ్ గుర్తించినట్టు సమాచారం. మన్యం జిల్లా మంత్రి పీడిక రాజన్నదొర సైతం సాలూరు నియోజకవర్గంలో ఓటమి బాటలో ఉన్నారు. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన రాజన్నదొర విద్యాధికుడు, వివాదరహితుడు. దీంతో జగన్ మలి విడత విస్తరణలో రాజన్నదొరకు మంత్రి పదవి ఇచ్చారు. డిప్యూటీ సీఎంగా కూడా ఎంపిక చేశారు. అయితే గిరిజనుల సమస్యలపై స్పందిస్తున్నా ప్రభుత్వం నుంచి నిధుల విడుదల లేకపోవడంతో ఆయనకు మైనస్ గా మారింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయలేకపోతున్నానని రాజన్నదొర లోలోపల బాధపడుతున్నారు. సమస్యలు పరిష్కారం కాక నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ఆ ప్రభావం రాజన్నదొర గెలుపుపై చూపుతోంది. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందాలనుకుంటున్న మంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఈసారి కష్టమేనని ఐ ప్యాక్ టీమ్ గుర్తించినట్టు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో ముత్యాలనాయుడికి చాన్సిచ్చారు. కీలక పోర్టు పోలియోలతో పాటు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టారు. కానీ మంత్రిగా తన ముద్ర చూపుకోవడంలో ముత్యాలనాయుడు ఫెయిలయ్యారు. అటు మాడుగుల నియోజకవర్గంలో ఆశించిన అభివృద్ధి లేకపోవడంతో ప్రజల్లో వైసీపీ సర్కారుపై విరక్తి పెరిగింది. ఆ ప్రభావం ముత్యాలనాయుడు గెలుపుపై చూపుతోంది. అనకాపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్నాథ్ కు ఓటమి తప్పదని తెలుస్తోంది. గత ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన అమర్నాథ్ కు మంత్రివర్గ విస్తరణలో అమాత్య పదవి కట్టబెట్టారు. కానీ ఆయనకు పార్టీలోనూ అసమ్మతి ఉంది. నియోజకవర్గ ప్రజల్లోనూ అసంతృప్తి నెలకొని ఉంది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖ ప్రగతి వైపు చూడకుండా నిత్యం రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణ ఉంది. గత ఎన్నికల్లో అత్తెసరు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి అన్ని ప్రతికూలతల దృష్ట్యా అమర్నాథ్ ఓటమి తప్పదని ఐ ప్యాక్ టీమ్ నిర్ధారించినట్టు తెలుస్తోంది. ఇలా ఉత్తరాద్రలో వైసీపే మంతతరులు ఎదురీదుతున్నారు.

# కూల్చివేతలోనూ ఇస్రో సక్సెస్

నెల్లూరు, మార్చి 8, భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ.. ఇస్రో మరో ఘనత సాధించింది. ఇదివరకెప్పుడు చేయని ఓ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. వరుస ఉపగ్రహ ప్రయోగాలతో రికార్డులు సృష్టిస్తున్న ఇస్రో తాజాగా ఓ అరుదైన ఘనత సాధించింది. జీవితకాలం ముగిసిన ఓ ఉపగ్రహాన్ని విజయవంతంగా సముద్రంలో కూల్చేసింది. కాలం చెల్లిన ఉపగ్రహాలను అంతరిక్షంలోనే పేల్చివేసే సామర్థ్యం ఇస్రోకు ఉన్నప్పటికీ.. అక్కడ పేల్చి వేస్తే ఆ శాటిలైట్ అవశేషాలు భవిష్యత్తులో ముప్పుగా మారతాయన్న బాధ్యతతో ఓ కాలం చెల్లిన ఉపగ్రహాన్ని భూకక్ష్యలోనికి తీసుకొచ్చి, సముద్రంలో కూలేలా చేసింది. ఈ తరహా ప్రయోగం జరపడం ఇస్రో చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో ఈ సంస్థ మరో ఘనత సాధించినట్లయ్యింది. 2011లో ప్రయోగించిన వెయ్యి కిలోల మేఘా ట్రాపికే-1 జీవితకాలం ముగియడంతో దాన్ని నియంత్రిత విధానంలో కూల్చేవేశారు. అయితే ఎటువంటి ప్రమాదం లేని ప్రాంతం గుండా శాటిలైట్‌ను భూవాతావరణంలోకి ప్రవేశించేలా ఇస్రో చర్యలు తీసుకుంది. ఉష్ణమండల వాతావరణ, పర్యావరణంపై అధ్యయనానికి దీనిని వాడారు. ఇటీవల కాలంలో చైనా ఉపగ్రహ శకలాలు ప్రపంచాన్నివణికించడంతో ? భారత్ అప్రమత్తమైంది. కాలం చెల్లిన తన ఉపగ్రహాలను నియంత్రిత విధానంలో కూల్చివేయడంపై ఇస్రో కసరత్తు మొదలుపెట్టింది. వాస్తవానికి అంతరిక్షంలోనే ఉపగ్రహాన్ని పేల్చివేసే సామర్థ్యం భారత్‌కు ఉంది. కానీ, అలా చేస్తే వాటి శకలాలు భవిష్యత్తులో సమస్యాత్మకంగా మారతాయి. మేఘ-ట్రోపికస్-1 ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగానికి ఎంచుకుంది. దీనిని 2011 అక్టోబర్ 12న ఫ్రాన్స్ స్పేస్ ఏజెన్సీ సీఎన్ఈసీ కలిసి సంయుక్తంగా ప్రయోగించాయి. ఉష్ణమండల వాతావరణ, పర్యావరణంపై అధ్యయనానికి దీనిని వాడాయి. వాస్తవానికి మూడేళ్లు మాత్రమే ఈ ఉపగ్రహం పనిచేస్తుందని తొలుత అంచనావేశారు. కానీ, ఇది 2021 వరకు నిరంతరాయంగా సేవలు అందించింది. ఈ ఉపగ్రహంలోని కాలం చెల్లిన పరికరాల పనితీరు ఏమాత్రం బాగోలేదు. నియంత్రణ సరిగా లేకపోతే ఉపగ్రహంలో వాడే విషపూరిత పదార్థాలు, రేడియోయాక్టివ్ ఐసోటోప్‌లు, రసాయనాల నుంచి ముప్పు ఉండవచ్చు. దీంతో దీనిని సముద్రంలో కూల్చివేయనున్నారు. పసిఫిక్ మహాసముద్రంలోని నిర్జన ప్రదేశంలో ఇది పడేలా మార్గాన్ని నిర్దేశించారు.

# ఆగని హార్ట్ స్ట్రోక్స్...



విజయవాడ, మార్చి 8, గుండెపోటు చావులు కొనసాగుతున్నాయి. గత వారం పది రోజులుగా ఎక్కడో చోట ఆకస్మిక మరణాలు జరుగుతునూ ఉన్నాయి. ముఖ్యంగా చిన్న వయసులో ఉన్న వారు, యువకులు, ఆరోగ్యంగా ఉన్నఉన్నట్టుండి ప్రాణాలు విడుస్తున్నారు. గత పక్షం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా మరణాలు పెద్ద సంఖ్యలో వెలుగు చూస్తున్నాయి. పల్నాడు జిల్లాలో గుండెపోటుతో ఓ విద్యార్థి నిద్రలోనే మరణించాడు. మరో విద్యార్థి కబడ్డీ ఆడుతూ కుప్పకూలి, ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడి మృత్యువాత పడ్డాడు. చిన్న వయసులోనే యువకులు ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. 20 ఏళ్లలోపు వయసున్నఇద్దరు యువకులు గుండెపోటుకు బలయ్యారు. చిన్న వయసులో ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో యువకుల మరణాలు అంతు లేని విషాదాన్ని నింపాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రుకు చెందిన ఫిరోజ్‌ఖాన్ చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ నుంచి వచ్చాక రాత్రి వరకు చదువుకుని నిద్రపోయాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పెద్దగా గురక పెడుతూ శబ్దాలు చేయడంతో పక్కనే ఉన్న సోదరి ఫర్జానా భయపడి తల్లిదండ్రులను నిద్ర లేపింది. వారు వచ్చి కడుపు నొప్పిగా భావించి మంచినీరు తాగించాలని చూసినా లోపలకు గుటక వేయకపోవడంతో బాధితుడ్ని హుటాహుటిన చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు హతాశులయ్యారు. తన కొడుకు కష్టపడి చదువుకుంటాడని, ఎలాంటి ఒత్తిడి, అనారోగ్యం లేవని, అనారోగ్య సమస్యలు లేవని మృతుని తండ్రి వజీర్‌బాషా విలపించారు. నిన్నటి తమతో కలిసి తిరిగిన మిత్రుడు హఠాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో స్నేహితులు, బంధువులు ఖిన్నులయ్యారు. గుండె పోటు తర్వాత మెదడుకు రక్తప్రసరణ పూర్తిగా నిలిచిపోవడంతో ఫిరోజ్‌ఖాన్ మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. అనంతపురంలో ఆడుకుంటున్న ఓ విద్యార్థి గుండెపోటుకు గురయ్యాడు. ఓ ప్రైవేటు కళాశాలలో బీ-ఫార్మసి చదువుతున్న తనూజ్‌నాయక్ అనే విద్యార్థి మార్చి 1వ తేదీన కళాశాల ప్రాంగణంలో కబడ్డీ ఆడుతూ సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని ఆసుపత్రిలో చేర్పించారు. తనూజ్ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి బాధితుడు మృతి చెందాడు. గుండెపోటు వల్లే తమ కుమారుడు మృతి చెందాడని వైద్యులు చెప్పినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శ్రీసత్యసాయి మడకశిర మండలం ఈ- అచ్చంపల్లి తండాకు చెందిన తనూజ్ కుటుంబం బెంగళూరుకు వలస వెళ్లింది. బాగా చదివి వృద్ధిలోకి వస్తాడనుకున్న చిన్న వయసులోనేమృతిచెందడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

# ముచ్చటగా 3వ సారి విచారణకు అవినాష్ రెడ్డి



కడప, మార్చి 8,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సీబీఐ అధికారులు ముచ్చటగా మూడోసారి నోటీసులు ఇచ్చారు. మార్చి 6వ తేదీన తమ విచారణకు రావాలంటూ వైయస్ అవినాష్ రెడ్డికి తొలుత సీబీఐ నోటీసులు ఇచ్చింది. అయితే ఆ రోజు తన నియోజకవర్గంలోని వేంపల్లిలో పార్టీ మండల, కార్యకర్తల, గృహసారథుల, కన్వీనర్ల, వాలంటీర్ల సమావేశం ఉందని.. ఈ నేపథ్యంలో హాజరుకాలేనని ఆయన సీబీఐకి తెలిపడంతో.. మార్చి 10వ తేదీన విచారణకు రావాలని అవినాష్ రెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు నోటిసులు అందజేశారు. దీంతో హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయానికి మరోమారు వైయస్ అవినాష్ రెడ్డి విచారణకు తరలి రానున్నారు. అలాగే ఎంపీ అవినాష్‌రెడ్డి తండ్రి వైయస్ భాస్కరరెడ్డికి సైతం.. మార్చి 12వ తేదీన కడపలో తమ విచారణకు హాజరుకావాలని సీబీఐ అదికారులు నోటిసులు అందజేశారు. అయితే తాను హైదరాబాద కు రాలేనని అవినష్ సీబీఐకి వర్తమానం పంపించారనుకోండి అది వేరే సంగతి. వివేకా హత్య కేసులో అందరి చూపులే కాదు.. వేళ్లన్నీ కూడా అనినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి వైపే చూపిస్తున్నాయనే విధంగా ఇప్పటికే దర్యాప్తు సంస్థ సీబీఐ... కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. అలాంటి పరిస్థితుల్లో వీరిద్దరికి సీబీఐ నోటీసులు జారీ చేసిందనగానే.. అటు మీడియా.. ఇటు సోషల్ మీడియాలో వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అదీకాక స్ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైయస్ భాస్కరరెడ్డికి సీబీఐ ఎప్పుడు నోటీసులు జారీ చేసినా.. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నాయంటూ... సీబీఐకి తెలపడం.. వారు మరో తేదీ ఫిక్స్ చేయడం.. ఆ క్రమంలో సీబీఐ అధికారులు ఎక్కడా.. ఎప్పుడూ.. వీరి పట్ల దూకుడుగా వ్యవహరించకుండా చాలా సమయమనం పాటిస్తూ వస్తున్నారనే చర్చ సైతం సాగుతోంది. ఇక గత జనవరి 28న వైయస్ వివేకా హత్య కేసులో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిని.. తొలిసారిగా హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో సీబీఐ అధికారులు విచారించారు. ఈ సందర్బంగా ఆయన కాల్‌డేటాపై సీబీఐ అధికారులు దృష్టి పెట్టారు. ఆ క్రమంలో వైయస్ వివేకా హత్య జరిగిన సమయంలో.. అంతకు ముందు... ఆ తర్వాత వెళ్లిన కాల్‌డేటాపై దృష్టి పెట్టడం.. అందులో భాగంగా నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, జగన్ సతీమణి పీఏ నవీన్ సెల్ పోన్లకు కాల్స్ వెళ్లినట్లు గుర్తించారు. దీంతో వీరిద్దరికీ సీబీఐ అధికారులు ఫిబ్రవరి 3వ తేదీన కడపలో తమ విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేశారు. వారిద్దరు సీబీఐ విచారణకు హాజరయ్యారు. అయితే వైయస్ జగన్ సతీమణి వైయస్ భారతి పీఏ నవీన్‌ను మరోసారి సీబీఐ అధికారులు.. విచారణకు పిలువనున్నారని.. అందుకు వారి న్యాయవాదితో ఇప్పటికే అంశంపై మాట్లాడినట్లు మీడియాలో కథనాలు సైతం వచ్చాయి. మరోవైపు వైయస్ వివేకా హత్య కేసులో సందేహం ఉన్న ప్రతి అంశాన్ని సీబీఐ అధికారులు వదిలిపెట్టకుండా విచారణ జరుపుతున్నారు. ఆ క్రమంలో వివేకా హత్య జరిగిన రోజు.. వైయస్ అవినాష్ తో ఫోటో దిగిన సుధాకర్ అనే వ్యక్తిని సైతం సీబీఐ అధికారులు పిలిచి మరీ విచారించడం గమనార్హం. ఇక వైయస్ వివేకా హత్య జరిగి ఈ ఏడాది మార్చి 15కి సరిగ్గా నాలుగేళ్లు పూర్తి కావోస్తోంది. అదే రోజు సీబీఐ పలువురిని అరెస్ట్ చేసినా.. అందులో ఆశ్చర్యం లేదనే ఓ చర్చ అయితే సోషల్ మీడియాలో వాడి వేడిగా నడుస్తోంది. ఇక ఇటు లోక్‌సభకు .... అటు అసెంబ్లీ ఎన్నికలకు అట్టే సమయం కూడా లేదు. ఈ నేపథ్యంలో అసలు వివేకా హత్య ఎందుకు జరిగింది?.. అసలు ఈ హత్య జరగడానికి గల ప్రధాన కారణం?.. వైఎస్సార్టీపీ పార్టీ అధినేత్రి షర్మిల చెప్పినట్లు కడప ఎంపీ సీటు కోసమే ఈ హత్య జరిగిందా? లేకుంటే.. ఆర్థిక వ్యవహారాలు కారణమా? లేకుంటే మరేదైనా కారణమా? ఇక వివేకా హత్యకు సుపారీగా 40 కోట్ల రూపాయిలు.. ఎవరు ఏర్పాటు చేశారు? ఎందుకు ఏర్పాటు చేశారు?.. అంత పెద్ద మొత్తంలో నగదు ఇచ్చి.. వైఎస్ వివేకాను ఇంత దారుణంగా హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది? అలాగే ఈ హత్య వెనుక ఉన్న అసలు సిసలు పాత్రధారులు, సూత్రధారులు ఎవరు అనేది బయటకు వస్తే.. దాని తాలుకు ప్రభావం వచ్చే ఎన్నికల ఫలితాలపై సుస్పష్టంగా పడుతోందనే ఓ చర్చ సైతం తెలుగు రాష్ట్రాల్లో వాడి వేడిగా నడుస్తోంది.

# 23 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

**బియ్యం విలువ మార్కెట్ లో రూ.40 లక్షలు పై మాటే.**

**స్పెషల్ బ్రాంచ్ ప్రత్యేక నిఘా.**

**అక్రమ దందా పై ప్రభుత్వం ఉక్కుపాదం.**

కాకినాడ పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతుంది. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేస్తుంది. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం నుంచి కాకినాడ వైపు రేషన్ బియ్యం లోడు తో వెళుతున్న పది చక్రాల లారీని ఆలమూరు మండలం మెయిన్ రోడ్డు లోని ఎస్.మలుపు దాటిన తరువాత స్పెషల్ బ్రాంచ్ అధికారులు దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సీహెచ్.సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖకు అప్పగించారు. ఏంఎస్ఓ టి.సుబ్బరాజు ఆ బియ్యాన్ని పరీక్షించిన తరువాత రేషన్ బియ్యం గా నిర్ధారించారు. అనంతరం తూకం వేసిన 910 బియ్యాన్ని మండపేట గోదాముకు తరలించారు. ఆ లారీలో సుమారు రూ.40 లక్షల విలువైన దాదాపు 23 టన్నుల రేషన్ బియ్యం ఉండవచ్చునని అధికారులు నిర్ధారించారు. మండలం లో రెండు రోజుల వ్యవధిలో రెండు వాహనాలను సీజ్ చేసి సుమారు 30 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారుల పనితీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. లారీ సీజ్.., డ్రైవర్ అరెస్ట్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని ఆలమూరు పోలీసులు సీజ్ చేసి డ్రైవర్ బత్తుల ధనరాజును అరెస్ట్ చేశారు. అక్రమ బియ్యం రవాణా సూత్రదారులపై ఆరా తీస్తున్నారు. ఈమేరకు స్థానిక ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముంబైలో మిస్సింగ్....జగ్గయ్యపేటలో ప్రత్యక్షం

విజయవాడ, మార్చి 8, ఏడాది క్రితం మహారాష్ట్రలో కిడ్నాప్‌నకు గురైన బాలుడు, జగ్గయ్యపేటలో పోలీసులకు చిక్కాడు. పాఠశాల వార్షికొత్సవంలో పాల్గొంటున్న ఆ బాలుడిని మహారాష్ట్ర పోలీసులు, స్దానిక పోలీసులు సహకారంతో తీసుకువెళ్లారు. ముంబయిలో కిడ్నాప్ అయిన బాలుడు ఏడాది తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జగ్గయ్యపేట ప్రాంతంలోని దేవుపాలెం గ్రామంలో ప్రత్యక్షమయ్యాడు. జగ్గయ్యపేటలోని ఒక ప్రైవేట్ స్కూలులో ప్రస్తుతం ఆ బాలుడు చదువుతున్నాడు. ముంబయిలో 2022లో బాలుడు కిడ్నాప్‌కు గురైనట్లుగా కుటుంబ సభ్యులు అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో అక్కడ పోలీసులకు విజయవాడకు చెందిన మహిళ బాలుడిని తీసుకువెళ్లినట్లుగా గుర్తించారు. ఆమె బాలుడిని జగయ్యపేటలోని ఓ మహిళకు 2లక్షల రూపాయలకు అమ్మేసింది. ఆమె దేవుపాలెంలోని తమ బంధువులకు మూడు లక్షల రూపాయలకు బాలుడిని ఇచ్చేసింది. అప్పటి నుంచి అదే కుటుంబంలో పెరుగుతున్న ఆ బాలుడు జగ్గయ్యపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. అంతా వారి పిల్లాడే అనుకుంటున్న టైంలో పోలీసులు వచ్చి ఆ బాలుడిని తీసుకెళ్లిపోయారు. మహారాష్ట్రకు చెందిన ఫ్యామిలీ బిడ్డగా చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయారు. పాఠశాల వార్షికోత్సవంలో సందడి చేస్తున్న సదరు బాలుడిని పోలీసులు గుర్తించి తీసుకెళ్లారు. ఆధారాలతో పోల్చి చూశారు. మహారాష్ట్ర పోలీసులు, స్థానిక పోలీసులు మాట్లాడుకొని గతంలో కిడ్నాప్ అయిన బాలుడు ఈ బాలుడు ఒక్కడే అని నిర్దారణకు వచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలుడిని అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ఎస్ఐ రామారావు సహకారంతో మహారాష్ట్ర పోలీసులు కేసు పత్రాలు చూపించి, బాలుడిని తీసుకెళ్లిపోయారు. ఏడాదిగా పెంచుకుంటున్న బాలుడిని హఠాత్తుగా పోలీసులు తీసుకువెళ్ళిపోవటంతో పెంచుకున్న తల్లి, కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కిడ్నాప్ చేసిన విజయవాడకు చెందిన మహిళ శ్రావణి, మధ్యవర్తిగా వ్యవహరించిన జగ్గయ్యపేటకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. వాళ్లను విచారించడంతో బాలుడి ఆచూకీ లభించిందని, పూర్తి సమాచారం సేకరించి, కేసుకు సంబందించిన ఎఫ్ఐఆర్ పత్రాలు, ఇతర వివరాలు తెలుసుకొన్న తరువాతే బాలుడిని మహారాష్ట్ర పోలీసులకు అప్పగించారు. ఈ కేసు వ్యవహారం తీవ్ర సంచలనం రేకెత్తించింది. ఏడాది క్రితం మహారాష్ట్రలో బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకువచ్చి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విక్రయించటం సంచలనంగా మారింది. ఈ కేసు ఆధారంగా అక్కడ పోలీసులు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. అంతా మహిళల పేర్లు మాత్రమే ఈ కేసులో వినిపించటంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు రెడీ అవుతున్నారు. తెర వెనుక ఉన్న వారి వివరాలు ఏంటి, కేవలం మహిళలే ఈ దందా అంతా నడిపించలేరని భావిస్తున్నారు పోలీసులు.

# సిక్కోలులో దారుణం

**ఫోన్లో వైద్యం... చిన్నారి దుర్మరణం**

శ్రీకాకుళం, మార్చి 8 , వైద్యో నారాయణో హరీ అంటారు. భగవంతుడు ఆయువు పోస్తే ఆపత్కాలంలోప్రాణాలు నిలబెట్టేవారు వైద్యులు అని అర్థం. ఆ గౌరవాన్ని నిలబెట్టుకుంటున్న వైద్యులు ఎందరో ఉన్నారు కానీ వారిలో నరరూప రాక్షసులూ ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి వైద్యం చేయటం బాధ్యత కదాఆ బాధ్యతను పక్కనపెట్టి నిండు ప్రాణాలను బలిగొంటున్నారు. ఇందులో పలాస ఆసుపత్రిలో ఓ అడుగు ముందుంది. ఇక్కడి వైద్యులు ఆసుపత్రికి రాకుండా ఫోన్లోనే వైద్యం చేసేశారు. దీంతో ఇక్కడి సిబ్బంది తెలిసీతెలియని వైద్యంతో బిడ్డను ఇష్టమొచ్చినట్టు బయటకు లాగేసి ఊపిరి తీసేశారు. విషయం మళ్లీ వైద్యురాలికి చేరవేశారు. ఆమె వచ్చిన వెంటనే డ్యూటీ డాక్టర్‌కు అక్కడి సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఆమె తెలివిగా ముందుగానే పెట్టుకున్న సెలవు దరఖాస్తును తెరమీదికి తెచ్చారు. తాను సెలవులో ఉన్నానని కలరింగ్ ఇచ్చారు. బిడ్డ చనిపోయిందని తెలియటంతో బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చామని, తాను ఒక జర్నలిస్టునని చెప్పినా అక్కడి వారి మనసు కరగలేదు. వైద్యురాలు వస్తున్నారంటూ మభ్యపెట్టారు. ముందుగానే చెబితే అప్పో సప్పో చేసి, వేరే ఆసుపత్రికి తీసుకువెళ్లి బిడ్డను బతికించుకునేవారమంటూ గుండెలవిసేలా రోదించడం తప్ప వారు ఏమీ చేయలేకపోయారు. పలాసకు చెందిన ఓ పేద జర్నలిస్టు రాజాం సురేష్. తన భార్యకు పురిటి నొప్పులు రావటంతో పలాసలోని సర్కారీ దవాఖానాకు తీసుకువెళ్లారు. వెళ్లిన వెంటనే అక్కడి సిబ్బంది పెద్ద బిల్డప్ లు ఇచ్చి ఏదో వైద్యం చేసేస్తున్నట్టు ఠాగూర్ సినిమాను తలపించేలా హడావుడి చేశారు. అప్పటి వరకు డ్యూటీ డాక్టర్ సెలవులో ఉన్నారని చెప్పకుండా డాక్టర్ ఐదు నిమిషాల్లో వచ్చేస్తారు అంటూ వైద్యం ప్రారంభించేశారు. అటూ ఇటూ ఓ గంటపాటు హడావుడి చేసి, తెలిసీ తెలియని వైద్యం చేసిపసిగొడ్డు ప్రాణం తీశారు. ఆ తరువాత డాక్టర్ సెలవులో ఉన్నారని, ఎనస్థీషియన్ కూడా లేరని వేరే చోటకు తీసుకువెళ్లాలని చావు కబురు చల్లగా చెప్పారు. ఎక్కడో ఉంటూ..పలాసలో వైద్యులు ఆడిందే ఆట పాడిందే పాట ఎక్కడో వైద్యం చేసుకుంటూఫోన్ల ద్వారా దిగువ స్థాయి సిబ్బందికి సూచనలు ఇస్తూ కాలం గడిపేస్తున్నారు. ఇక్కడ ఇంకో రకమైన తెలివితేటలు కూడా ఉపయోగిస్తున్నారు. ముందుగానే లీవ్ లెటర్ ఆసుపత్రిలో ఉంచుతున్నారు సొంత క్లినిక్‌లు, సొంత పనులపై ఉంటూ అంతా బాగున్నంత కాలం డ్యూటీలో ఉన్నట్టే లెక్క, ఏదైనా జరగరానిది జరిగితే మాత్రం మేం సెలవులో ఉన్నాం అని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధానం పలాస ఆసుపత్రికి ఆనవాయితీగా మారింది. ఎందుకంటే ఇక్కడ పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. అడిగేవాడే లేడు మంత్రి అప్పలరాజు ఎప్పుడైనా తనిఖీకి వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేస్తే ఒక్క రోజే పనిచేస్తారు ఆ తరువాత షరా మామూలే అని గ్రామస్థులు చెబుతున్నారు. అడిగే వాడే లేడుపలాస ప్రభుత్వ ఆసుపత్రిలో అరాచకం రాజ్యమేలు తోంది. ఎంతో సమున్నత ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సర్కారీ వైద్యాన్ని బలోపేతం చేస్తున్నారు. కానీ ఇక్కడి వారికి ఇవేవీ పట్టటం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దొరికినకాడికి దోచుకుంటున్నారు. వైద్యులు సమయానికి రారు. వచ్చినా వైద్యం చేయరు. సిబ్బందిదీ అదే తీరు డ్రగ్ స్టోర్ మందులు ఉండవు ముందే అమ్మేస్తే ఎందుకుంటాయి అంతా అస్తవ్యస్తం. ఇక్కడి ఆసుపత్రికి అభివృద్ధి కమిటీప్రతినిధిదే హవా. ఆయన సూచనమేరకే ఏదైనా జరగాలి. ఆయనను ప్రసన్నం చేసుకుంటే అంతా సవ్యంగా సాగిపోతుంది. దీంతో ఇక్కడి వైద్యులు సిబ్బంది ఆ పనిలోనే ఉంటే వైద్యాన్ని గాలికొదిలేశారు.

# బీసీలకు పెద్ద పీట

గోపాలపట్నం రాష్ట్రంలో బీసీలకు పెద్దపీ ట వేసిన వ్యక్తి సీఎం జగన్మోహన్ రెడ్డి అని వైసిపి నేత టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు విశాఖ గోపాలపట్నం కుమారి కళ్యాణమండపంలో శిష్టకరణ సంఘం సంఘీభావ సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి ఆర్ కృష్ణయ్య మాట్లాడు తూ... ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి సుధాకర్ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల ని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు, అలాగే బీసీలకు చట్టసభల్లో అనేక పదవులు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు.

## ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు అన్ని రంగాల్లో మహిళలు ముందు ఉండాలి ఆదర్శ మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే విజయమ్మ కోరారు. బుధవారం వీరారెడ్డి విద్యాసంస్థల్లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా మార్చి ఎనిమిదో తేదీ అంతర్జాతీయంగా మహిళా దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషమన్నారు. ఒకప్పుడు ఒంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని ఇది గర్వించదగ్గ విషయం అన్నారు. దేశ రాష్ట్రపతి మహిళ కావడం మహిళా లోకానికి ఎంతో గర్వకారణం అన్నారు. దేశ రక్షణలోనూ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆమె తెలిపారు. అసెంబ్లీ పార్లమెంట్ రాజ్యసభల్లోనూ మహిళలు ఉన్నారంటే మనకెంతో గర్వకారణం అని ఆమె పేర్కొన్నారు. సమానత్వ పునాది పైనే సాధికారత లభిస్తుందని అన్నారు. క్షేత్ర స్థాయిలోను వివిధ నిర్ణయాత్మక వ్యవస్థల్లో మహిళల ప్రాతినిధ్యం ఆరోగ్య కర స్థాయిలో ఉంది కానీ ఉన్నత స్థాయి వ్యవస్థలకు వెళ్లేకొద్దీ వారి ప్రాతినిధ్యం అంతకంతకు పలుచగా ఉంటుంది. అధికారిక స్వామ్యంలో రాజకీయ న్యాయ వ్యవస్థలో కార్పొరేట్ ప్రపంచంలో ఇలా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. విద్యావంతులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఇదే ఒరవడి కొనసాగుతుంది. చదువు ఒక్కటే మహిళల ఆర్థిక రాజకీయ స్వాలంబనకు హామీ ఇవ్వదని దీన్నిబట్టి మనకు అర్థమవుతుంది. ఈ పరిస్థితిని మార్చాలంటే ముందు దృక్పథాల్లో మార్పు రావాలని విజయమ్మ కోరారు. మహిళల పట్ల సమాజంలో లోతుగా పాతుకుపోయిన ఇలాంటి నిర్దేష్టూఖమైన అభిప్రాయాలను పార తోలడం ద్వారానే శాంతియుతమైన ప్రగతి నాయకమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని విజయమ్మ అన్నారు భారతీయ మహిళలు నిర్ణయాత్మక శక్తులుగా వెలుగుందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఆమె పేర్కొన్నారుమహిళల ధీరత్వం పాండిత్యంతోపాటు వారి పాలన ప్రతిభకు అద్దం పడతాయని విజయమ్మ అన్నారు. సమావేశంలో విద్యా సంస్థల విద్యార్థినిలు తెలుగుదేశం పార్టీ మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మహిళల అన్ని రంగాలలో ముందుండాలి

### కమిషనర్ రవి చంద్రా రెడ్డి

నంద్యాల అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మెప్మా కార్యాలయం లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ .మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోరాటాలకి, పని గంటల తగ్గింపు ఉద్యమానికి, స్త్రీ పురుష సమాన హక్కులకు, లింగ వివక్షత వ్యతిరేకతకు ప్రతిబింబం. 1910లో డెన్మార్క్ రాజధాని కోపెన్ హెగన లో శ్రామిక మహిళా నాయకురాలు మార్చి 8 ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించారు. 1975లో ఐక్యరాజ్యసమితి కూడా మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా అధికారికంగా ప్రకటించినది. భారత రాజ్యాంగంలో స్త్రీలకు పురుషులకు సమాన హక్కులు కల్పించబడినాయి. స్త్రీలు అనేక రంగాలలో ముందంజ వేసినప్పటికీ ఇప్పటికీ లింగ వివక్షత, సమాన హక్కులలో రాజ్యాంగ నిబంధనలు అమలు జరగడం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. మెప్మా సీఎమ్ఎమ్. భాస్కరరెడ్డి. సీఓ. ఆర్ పీలు. తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

నంద్యాల ఆకాశంలో సగం' 'అవనిలో సగం అన్నిటా సమాన అవకాశాలు మహిళలకు కావాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి. నిర్మల అన్నారు.బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టి. నరసింహ్మయ్య భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా హక్కులు.. మహిళల రక్షణ అనే అంశంపై సదస్సును..... అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ నాగరాజు పట్టణ అధ్యక్షులు డి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి. నిర్మల మాట్లాడుతూ శ్రమ దోపిడీ వ్యతిరేక ముకులైన జీవితం కొరకు ఓటు హక్కు కొరకు సి ఉనోత్సవాన్ని అప్ సంవత్సరము మహిళంటున్న రోజు అన్నిటా కావాల్సిన మహిళలు వారి హక్కులు వెనుక ఉన్నాయన్నారు. ప్రతి చోట మహిళలపై బాలికలపై లైంగిక దాడులు వివక్ష హింస పెరిగిపోతుందన్నారు.ఉపాధిలో 27.7 శాతం మాత్రమే మహిళలు అంటున్నారని, పని ప్రదేశాల్లో యజమానులతోటి కార్మికులపైన వేధింపులు అఘైత్యాలు పెరిగిపోతున్నాయి అన్నారు.తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ పని చేయించుకుంటూ మహిళల శ్రమను దోచుకుంటున్నారని ఆమె ఆవేదన చెందారు.వ్యవసాయ కార్మికులు పంట పొలాల్లో యాంత్రికరణ వల్ల పనులు లేక ఉపాధి పనులు ఎక్కువ రోజులు పెట్టకపోవడం వల్ల సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లి ప్రమాణాల్లో చనిపోతున్నారని పని ప్రదేశాల్లో ఆసౌకర్యాల నడుమ బాధలు పడుతున్నారన్నారు.సనాతన ధర్మం పేరుతో, ఆడవారిని ఇంటిపట్టునే ఉండాలంటూశుద్దులు చెప్పే వారు బయలుదేరారని విమర్శించారు.మహిళల పైన పడుతున్నది. ప్రభుత్వం మద్యం అమ్మకాలను పెద్ద పరచి ప్రోత్సహించడం వల్ల దర్తలు మద్యానికి బానిసలై కుటుంబాలు చిన్నా చిన్నిమవుతూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. బాల్య వివాహాలు పెరుగుతున్నాయి. పార్లమెంటులో రాజ్యసభలో మహిళలకు సమభాగస్వామ్యం కల్పించాలని కనియం 33 శాతం రిజర్వేషన్ కొరకు పోరాడుతున్నా పురుషాధిక్యత పార్టీలు చట్టరూపం కాకుండా అడ్డుకుంటున్నాయి. రాజకీయ ఆర్థిక ప్రజా జీవితంలో నిర్ణయాధికారము అని స్థాయిలో మహిళలకు సమభాగస్వామ్యం సమాన అవకాశాలు ఉండడం లేదు. కనీసం కుటుంబంలో సమభాగస్వామ్యము ఉండటం లేదు ఇంటి పనికి విలువ ఉండడంలేదన్నారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలు ఈ నైపుణ్యాలకు చాలా దూరంగా ఉన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, లింగ సమానత్వం కొరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం (ఐద్వా) పోరాడుతున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలు సేమేం సుభద్రా లలిత ప్రేమ జ్యోతి ఆశాజ్యోతి ప్రశాంతి వీరితోపాటు ఐదవ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది×

## మహిళల నిర్ణయాలను మనం గౌరవించాలి జిల్లా కలెక్టర్

తిరుపతి భారతదేశంలో వేద కాలం , పురాణ కాలాలలో మహిళలు అన్ని రంగాలలో గౌరవింపబడే వాళ్ళని, మధ్యయుగంలో మహిళల ప్రాధాన్యత తగ్గడం , అనంతరం మనకు స్వాతంత్రం వచ్చిన తరువాత బిఆర్ అంబేద్కర్ సమానత్వం కోసం రాజ్యాంగంలో అనేక ఆర్టికల్స్ మహిళల కోసం సమానత్వం కల్పించడంతో పురాణ , వేద కాలం నాటి మహిళలకు వున్న గౌరవం నేడు మహిళలకు దక్కుతున్నదని జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బుధవారం ఉదయం స్థానిక న్యూ బాలాజీ కాలనీలో మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఎంప్లాయిస్ మహిళా విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య విషయాలపై దృష్టి పెట్టాలని అప్పుడే విద్యలోనూ, ఆర్థికంగా కుటుంబం , సమాజం బల పడుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడి ఇంటికే పరిమితం కాకుండా ఇంటి పనులతో పాటు ఆర్థిక కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల పని భారం పెరుగుతుందని అందుకే తప్పనిసరి మొదటి ప్రాధాన్యత మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడిన 9 నెలల కాలంలో మెడికల్ రికార్డుల మేరకు జిల్లాలో రెండింత 3 వంతు అంటే దాదాపు 12 లక్షల మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని గుర్తించడం జరిగిందని, అందులో మహిళ లు 45 సంవత్సరాల పైబడిన వారికి 80% మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని అన్నారు. ఆసుపత్రుల్లో వైద్యం కోసం వస్తున్న వారు రెండు , మూడు దశలలో రావడం జరుగుతున్నదని అది ప్రమాద స్థాయి అన్నారు. మొదటి దశలోనే గుర్తించడానికి తిరుపతి జిల్లా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి , సంవత్సరములోపు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మొదట పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి , విశాఖపట్నం లను ఎంపిక చేసిందని త్వరలో కార్యచరణ అమలు కానున్నదని అన్నారు. అన్ని శక్తులు మహిళల్లో ఉన్నాయని గ్రహించాలని పిల్లలకు భయం కాదు గౌరవం నేర్పించాలని రేపటి తరానికి ఆదర్శంగా నిలిచేలా అన్ని రంగాల్లో అంటే క్రీడా విద్య వైద్య సాంకేతిక ఐటి లో సమానత్వం కల్పించాలని అన్నారు. ప్రస్తుత ప్రధాన సమస్య మహిళలలో గర్భిణీ స్త్రీలలో అధిక రక్తహీనత ఉందని తప్పనిసరి ప్రభుత్వం అందిస్తున్న గోరుముద్ద పౌష్టికాహారం వంటివి పొంది బయటపడాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల 16 సంవత్సరాల లోపు గర్భవతులు హై రిస్క్ గర్భవతులుగా నమోదవుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లో బాల్యవివాహాలు వద్దని , దాచిపెట్టరాదని తల్లిదండ్రులకు సూచిస్తున్నామని అన్నారు. గత నాలుగు నెలలలో హై రిస్క్ గర్భవతులను ప్రసవ సమయానికి ఏడు రోజులు ముందే ప్రభుత్వమే ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించడం వల్ల మరణాలు లేవని శుభపరిణామమని అన్నారు. మహిళలను ప్రోత్సహించే కార్యక్రమాలు తరచు నిర్వహించేలా డిఆర్డిఏ ,మెప్మా , ఐసిడిఎస్ సంయుక్తంగా నిర్వహించాలని సూచించారు.మొదట గా అంతర్జాతీయ మహళా దినోత్సవ వేడుక ల సందర్భంగా గౌ. జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి వారికి క్యాబ్స్ తో ఫోటో ఫ్రేమ్ మహిళల అద్భుత బహుమతితో స్వాగతం పలికారు.సమావేశ అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘాల నాయకులు ఉద్యోగులు, శాంతి దుర్గ , ప్రసాద్ రావు, రాధమ్మ , జ్యోతి , డాక్టర్ ప్రసన్న, శశికళ ,నాగేశ్వరరావు, లక్ష్మీపతి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధిలో మహిళలది కీలకపాత్ర

కాకినాడ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా సామర్ల కోట టీటీడీసీ కేంద్రంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ మహిళలు అభివృ ద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని.. కుటుంబాలు అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని.. ఇలా రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. అందుకే మహిళలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తూ ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నాయన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

### జొన్నగిరి గ్రామం నందు ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

తుగ్గలి తుగ్గలి మండల వ్యాప్తంగా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక వెలుగు కార్యాలయం నందు జ్యోతి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెలుగు కార్యాలయం నుండి మహిళలు ర్యాలీను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ తుగ్గలి మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ మహిళలు సమాజంలో పురుషులతో పాటుగా ఆర్థికంగా,సామాజికంగా ఎదగాలని తెలియజేశారు.మహిళలందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని తెలియజేశారు.నేటి సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా రాణిస్తున్నారని తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయం నందు అధికారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాధాకృష్ణ,హెచ్డిసిసి ఆంజనేయులు,సీసీలు శేఖర్,ఆచారి మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని జొన్నగిరి గ్రామం నందు ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీను నిర్వహించి మహిళలకు ఆట పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమ ముఖ్య అతిథి ఆర్డిటి డైరెక్టర్ డాక్టర్ హరి నారాయణ మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించి వారికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలియజేశారు.స్త్రీ సకల దేవతలకు జన్మనిచ్చు సృష్టిని నడిపించు ఆదిపరాశక్తి అని, అటువంటి మహిళ మూర్తులను గౌరవించాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జొన్నగిరి సర్పంచ్ ఓబులేసు,ఎంపీపీ ఎర్ర నాగప్ప,ఆర్డిటి పత్తికొండ ఏటీఎం రెహనా,వీఆర్వో నయోమి, సిడిసి మహిళలు,కమ్యూనిటీ ఆర్గనైజర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయమహిళా దినోత్సవం

### ఆర్టీసీ ఉద్యోగులు

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో ఎదురుగా ఆర్టీసీ ఉద్యోగులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సభను జి.యు. నాగరాజ్ అసిస్టెంట్ మేనేజర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మహిళల గురించి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి గారి భార్య మెకానికల్ ఇంజనీరింగ్ చేసి టెల్కోలో చేరినప్పుడు అవహేళన గురై ఇప్పుడు ఇన్ఫోసిస్ లో చైర్ పర్సన్ గా రాణించారనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఏ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మొదలు తల్లి డిసిప్లేన్ నేర్పేది "మహిళ"అని ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలకు అభివాదిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కండక్టర్లు వరలక్ష్మి,అరుణమ్మ, లక్ష్మీదేవి,మరియు ఏపీఎస్ఆర్టీసీ కానిస్టేబుల్ అఖిల హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ,టిఐ 2 పంపయ్య, ఏఎంఎఫ్ షఫీ ,లక్ష్మీపుత్ర, సిసిఎస్ డెలికేట్ ఎమ్మెస్ వాసులు, ఈయూ కార్యదర్శి ఎం ఎస్ వాసులు, రంగన్న,చాంద్,శ్రీ రాములు, రామాంజనేయులు,యూ యు తిప్పన్న, ఓబుల్ రెడ్డి, రోషన్, మాధవ్ 60 మంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

## మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ కొట్టేసిన బలగం

గత వారంలో థియేటర్ల ద్వారా ప్రేక్షకులు ముందుకు వచ్చిన అన్ని సినిమాలలో బలగం సినిమా క్లీన్ హిట్ గా నిలిచింది. కమెడియన్ వేణు దర్శకుడిగా



మారి ఈ సినిమా తెరకెక్కించారు. జబర్దస్త్ ద్వారా మంచి ఫేమస్ అయిన వేణు కొన్నాళ్లుగా జబర్దస్త్ సినిమాలు అన్నింటికి దూరమై ఈ సినిమా మీదనే వర్క్ చేశారు. దిల్ రాజు కుమార్తె హర్షిత రెడ్డి హర్షిత్ రెడ్డి నిర్మాతలుగా ఈ సినిమా తెరకెక్కింది.దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ తో మొట్టమొదటి సినిమాగా ఈ సినిమా వచ్చింది. దిల్ రాజు బ్యానర్ ఉండడంతో సినిమాకు బాగా ప్లస్ అయింది. ప్రియదర్శి కావ్య కళ్యాణ్ రామ్ రచ్చ రవి వేణు వంటి వారు కీలక పాత్రలలో నటించిన ఈ సినిమా మొదటి ఆట నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.చిన్న సినిమాగా రూపొందిన ఈ సినిమా నిజాం సహా ఆంధ్రప్రదేశ్ లో సైతం డీసెంట్ కలెక్షన్స్ వస్తున్నాయి. సినిమా బడ్జెట్ చాలా తక్కువ కావడంతో ఇప్పటికే దాదాపుగా ఆ బడ్జెట్ అంతా రికవరీ చేసినట్లుగా చెబుతున్నారు. మొదటి వీకెండ్ అంటే మూడు రోజుల్లోనే ఈ సినిమా దాదాపుగా బడ్జెట్ రికవరీ చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాకి సంబంధించి మొదటి మూడు రోజుల కలెక్షన్స్ విషయానికి వెళ్తే మొదటి రోజు 55 లక్షలు రెండవ రోజు 80 లక్షలు మూడో రోజు కోటి 75 లక్షలు వసూలు చేసింది.తద్వారా మూడు రోజులుగాను మూడు కోట్ల 10 లక్షలు గ్రాస్ కోటి 30 లక్షల షేర్ వసూలు చేసింది. ఇక ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల 15 లక్షల గ్రాస్ కోటి 32 లక్షల షేర్ వసూలు చేసిన ఈ సినిమా మొత్తం బిజినెస్ కోటి 15 లక్షలకు జరిగింది. బ్రేక్ ఈవెన్ కోటి 30 లక్షలుగా నిర్ణయించారు. ఇప్పటికే రెండు లక్షల లాభాలతో ఈ సినిమా హిట్ స్టేటస్ సాధించింది. ఇప్పట్లో శుక్రవారం వరకు మళ్లీ థియేటర్లలో సినిమాలు రావు కాబట్టి మరిన్ని వసూలు లభించే అవకాశం కల్పిస్తోంది.

## తెరపై అతిథులు అదరగొడుతున్నారు!


సౌత్ సినిమా ట్రెండ్ మారిందిప్పుడు. తెరపై హీరో ఒక్కడే కాదు..ఆయనతో పాటు తెరను పంచుకోవడానికి మిగతా స్టార్ హీరోలు సిద్దంగా ఉంటున్నారు. తద్వారా సినిమాకి పెద్ద ఎత్తున జరుగుతుంది. ఇది సౌత్ సహా టాలీవుడ్ లో కొత్త ట్రెండ్ లా మారింది. ఆమధ్య రిలీజ్ అయిన 'గాడ్ ఫాదర్' చిత్రంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ అతిధి పాత్రలో మెప్పించిన సంగతి తెలిసిందే. సల్మాన్ ఎంట్రీ తో ఈలలతో ఒక్కసారిగా థియేటర్ దద్దరిల్లింది.అలాగని సల్మాన్ రుణం చిరంజీవి ఉంచుకోవడం లేదు. ఆయన కుమారుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భాయ్ తాజా సినిమా 'కీసికా భాయ్..కీసికా జాన్'



చిత్రంలో చరణ్ కూడా గెస్ట్ పాత్ర పోషిస్తున్నాడు. బాలీవుడ్ కి ఇప్పటికే చరణ్ 'జంజీర్' తో పరిచయం. అటుపై 'ఆర్ ఆర్ ఆర్' సక్సెస్ తో అక్కడా పెద్ద స్టార్ అయ్యారు. ఆరకంగా భాయ్ సినిమా హిందీ మార్కెట్ కి చరణ్ దోహదపడుతున్నారు. అలాగే ఇటీవల రిలీజ్ అయిన 'వాల్తేరు వీరయ్య'లో మాస్ రాజా రవితేజ కూడా కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.రవితేజ పెద్ద స్టార్ అయిన తర్వాత మరో స్టార్ చిత్రంలో భాగం అవ్వడం ఇదే తొలిసారి. దీంతో రాజా ఇమేజ్ బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ అయింది. ఇప్పుడు రవితేజ కోరితే చిరంజీవి సైతం నో చెప్పే ఛాన్స్ లేదు. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న 'జైలర్' చిత్రంలో మోహన్ లాల్..శివరాజ్ కుమార్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేరే భాషల అగ్ర నటులు రజనీ సినిమాలో భాగం అవ్వడం ఇదే తొలిసారి.రజనీ ఇమేజ్ నే ఆకాశమంత. ఇప్పుడు స్టార్ కి తోడుగా వీళ్లిద్దరు కూడా భాగమవ్వడంతో జైలర్ పై అంచనాలు శిఖరాన్ని మించి కనిపిస్తున్నాయి. అంతకు ముందు కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన 'విక్రమ్' సినిమాలో మరోస్టార్ సూర్య రోలెక్స్ పాత్రతో అదరగొట్టిన సంగతి తెలిసిందే. లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనిర్శలోకి సూర్యని తీసుకొచ్చి అక్కడ గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చారు.'ఢిల్లీ-2' లో అదే రోలెక్స్ ఏకంగా కథనే నడిపించబోతున్నాడు. అలాగే సూర్య నటించిన 'ఆకాశం నీ హద్దురా'ని బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ రీమేక్ చేస్తున్నారు. ఇందులో కూడా సూర్య ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇలా ఒక స్టార్ సినిమాలో మరో స్టార్ నటించడం మార్కెట్ పరంగానూ కలిసొస్తుంది. ఆయా సినిమాలకు భారీ ఎత్తున ప్రీ రిలీజ్ బిజినెస్ జరుగుతుంది. భవిష్యత్ లో ఈ ట్రెండ్ మరింత ఎక్కువగా కనిపించనుంది.

## ఎన్.టి.ఆర్ ఫిట్నెస్ అంటే అలానే ఉంటుంది..!

యంగ్ టైగర్ ఫిట్నెస్ గురించి ఆర్.ఆర్.ఆర్ డైరెక్టర్ రాజమౌళి ప్రత్యేకంగా చెప్పుకొచ్చారు. ఆర్.ఆర్.ఆర్ సినిమా ప్రపంచవ్యాప్తంగా సినీ లవర్స్ ని ఆకట్టుకుంటుంది. హాలీవుడ్ ఆడియన్స్ కూడా ఈ సినిమా చూసి ఫిదా అవుతున్నారు. ఒక తెలుగు సినిమాకు ఇంటర్నేషనల్ లెవెల్ లో ఇలాంటి గుర్తింపు రావడం అన్నది సాధారణమైన విషయం కాదు. ఇక మార్చ్ 12న జరుగనున్న 95వ ఆస్కార్ వేడుకల్లో కూడా ఆర్.ఆర్.ఆర్ టీం పాల్గొంటుంది. సినిమా లోని నాటు నాటు సాంగ్ ఆస్కార్ నామినేషన్స్ లో ఉన్న విషయం తెలిసిందే.ఇక యూఎస్ లో ఆర్.ఆర్.ఆర్ అనుభవాలను మీడియాతో పంచుకున్న రాజమౌళి ఎన్.టి.ఆర్ ఫిట్నెస్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. తారక్ తో అడివిలో సీన్ చేసేప్పుడు యాక్షన్ కొరియోగ్రాఫర్ ముందు ఆ స్టంట్ చేసి చూపించగా అతని కన్నా వేగంగా ఎన్.టి.ఆర్ పరుగెత్తాడని దాన్ని కెమెరాలో క్యాప్చర్ చేయడం కష్టం అనిపించిందని.నటనలోనే కాదు ఫిట్ నెస్ లో కూడా ఎన్.టి.ఆర్ పర్ఫెక్ట్ అని అన్నారు రాజమౌళి. పర్ఫెక్ట్ డైట్ మెయింటైన్ చేయడం వల్లే ఎన్.టి.ఆర్ అలా చేయగలుతున్నారని చెప్పారు రాజమౌళి.ఆర్.ఆర్.ఆర్ సినిమాలో కొమురం భీమ్ పాత్రలో ఎన్.టి.ఆర్ అదరగొట్టేశారు.



ఇప్పటికే భీం పాత్రలోని తారక్ నటనతో వరల్డ్ సినీ లవర్స్ అంతా ఫిదా అవగా ఆర్.ఆర్.ఆర్ లో చరణ్ ఎన్.టి.ఆర్ ఇద్దరు పోటీ పడి మరీ నటించారు.మెగా నందమూరి కాంబో సినిమా ఫ్యాన్స్ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆర్.ఆర్.ఆర్ తీశాడు రాజమౌళి. సినిమా కమర్షియల్ గా సూపర్ సక్సెస్ అందుకోవడమే కాకుండా ఎన్నో ఇంటర్నేషనల్ అవార్డులను సైతం అందుకుంటుంది.ఆర్.ఆర్.ఆర్ తర్వాత ఎన్.టి.ఆర్ చరణ్ ఇద్దరు హీరోలు చేసే సినిమాల మీద హాలీవుడ్ ప్రేక్షకుల ఆసక్తి ఉండనుంది. ట్రిపుల్ ఆర్ తర్వాత చరణ్ శంకర్ డైరెక్షన్ లో సినిమా చేస్తుండగా.. ఎన్.టి.ఆర్ కొరటాల శివ డైరెక్షన్ లో సినిమా ఫిక్స్ చేసుకున్నారు.

## ఇదేమి సెలబ్రేషన్‌రా నాయనా... ఇప్పటివరకు చూసి ఉండరు! వీడియో వైరల్!

వన్డే ప్రపంచకప్-2023 క్వాలిఫియర్స్ ఆశలను నేపాల్ జట్టు సజీవంగా నిలుపుకుంది. ఐసీసీ వరల్డ్ కప్ లీగ్-2లో భాగంగా యూఏఈతో జరిగిన దూ



ఆర్దై మ్యాచ్‌లో 42 పరుగుల తేడాతో నేపాల్ ఘన విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. నేపాల్ బ్యాటర్లలో భీమ్ షార్కి(70), ఆరిఫ్ షేక్(43) పరుగులతో రాణించారు.యూఏఈ బౌలర్లలో జూనైడ్ సిద్దూఖి మూడు వికెట్లు, ముస్తఫా, లాక్రా తలా రెండు వికెట్లు సాధించారు. అనంతరం 230 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ.. 45 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. యూఏఈ బ్యాటర్లో ఆసిఫ్ ఖాన్(82), ఆర్యన్ లాక్రా(50) పరుగులతో రాణించనప్పటికీ.. ఓటమి మాత్రం యూఏఈ వెంట నిలిచింది. ఇక నేపాల్ బౌలర్లలో దీపేంద్ర సింగ్, కామి తలా మూడు వికెట్లతో యుఏఈ పతనాన్ని శాసించారు.పేంద్ర సింగ్ స్పెషల్ సెలబేషన్స్...నేపాల్ విజయంలో ఆ జట్టు స్పిన్నర్ దీపేంద్ర సింగ్ కీలక పాత్ర పోషించాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసిన దీపేంద్ర సింగ్ కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. ఇక ఇది ఇలా ఉండగా.. ఈ మ్యాచ్‌లో దీపేంద్ర సింగ్ ఓ స్పెషల్ సెలబ్రేషన్స్‌తో అందరని ఆశ్చర్యపరిచాడు.యూఏఈ ఇన్నింగ్స్ 42 ఓవర్ వేసిన దీపేంద్ర.. అద్భుతంగా ఆడుతున్న ఆసిఫ్ ఖాన్‌ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపాడు. దీంతో నేపాల్ జట్టు సంబురాల్లో మునిగి తేలిపోయింది. దీపేంద్ర సింగ్ అయితే గ్రౌండ్‌లో పై ఫ్లిప్స్ (గెంతులు) వేసి వికెట్ సెల్‌బ్రేషన్స్ జరపుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఐసీసీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో ఈ వీడియో? వైరల్‌గా మారింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**